ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -309 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 26 సెప్టెంబర్ 2025

# ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం







## మెగా డీఎస్సీ విజేతలకు నియామకపత్రాలు అందించిన సీఎం చంద్రబాబు

మెగా డీఎస్సీని సాధించి చూపాం

ఇక ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

-అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన బాబు

సచివాలయం సమీపంలో ఓ వేడుకలా కార్యక్రమం

150 రోజుల్లో మెగా డీఎస్సీ పూర్తి చేసిన

మంత్రి లోకేశ్ బృందానికి అభినందనలు

అమరావతి, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి**

మెగా డీఎస్సీ సాధ్యమా అన్నారు.. మెగా డీఎస్సీని సూపర్ హిట్ చేసి చూపించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు- చేసిన వేదికపై 15,941 మంది మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 150 రోజుల్లోనే డీఎస్సీ పూర్తి చేసిన.. విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను అభినందించారు.



మిగతా 2లో.

## చిరంజీవి గట్టిగా అడిగితే జగన్ దిగొచ్చాడా?...

అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణ

జగన్ హయాంలో సినీ ప్రముఖులకు తీవ్ర అవమానం జరిగిందన్న బాలకృష్ణ

ఆనాడు ఎవరూ గట్టిగా ప్రశ్నించలేకపోయారని వ్యాఖ్య

జగన్‌తో భేటీకి నాకు ఆహ్వానం వచ్చినా వెళ్లలేదని వెల్లడి



2లో.

## తప్పు చేయను.. చేసేవారిని వదలను

### అసెంబ్లీలో శాంతిభద్రతలపై చర్చలో సీఎం చంద్రబాబు

రాజకీయ ముసుగులో నేరాలు సహించేది లేదు

గత ప్రభుత్వ హయాంలో అందరూ బాధితులే

తనతో సహా అందరిపైనా రకరకాల కేసులతో వేధింపులు

వైకాపా అరాచకానికి పరాకాష్టగా నాటి పాలన

సింగపూర్ వారిని కూడా బెదిరించిన ఘనులు

రాష్ట్రం నుంచి పరిశ్రమను తరలించిన గల్లా జయదేవ్

రాష్ట్రంలో శాంతిభద్రతల రక్షణకు పెద్దపీట



2లో.

## నా చొరవతోనే సమస్యలు పరిష్కారం



2లో.

పరిశ్రమ సమస్యలు వివరించేందుకే భేటీ

కొవిడ్ కారణంగా ఐదుగురికే అనుమతి అని జగన్ అన్నారని గుర్తుచేశారు

బాలకృష్ణ ఫోన్‌లో అందుబాటులోకి రాలేదని వివరణ

అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలపై చిరంజీవి క్లారిటీ

## తెలంగాణ ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో

తప్పుకున్న ఎల్ అండ్ టీ!

ఎల్ అండ్ టీకి ఉన్న రూ. 13 వేల కోట్ల అప్పును టేకోవర్ చేయనున్న ప్రభుత్వం

ఎల్ అండ్ టీకి రూ. 2,100 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైన ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్టును తన ఆధీనంలోకి తీసుకోనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్ అండ్ టీ సీఎండీ మధ్య అంగీకారం కుదిరింది

మిగతా 2లో.



## తిరుమలలో మరో ఆధునిక వసతి సముదాయం

ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం




తిరుమల **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి** తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మరో అత్యాధునిక వసతి సముదాయం ప్రారంభమైంది. వేంకటాద్రి నిలయం యాత్రికుల వసతి సముదాయంను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఏపీ సీఎం చంద్రబాబు కలిసి ప్రారంభించారు.

మిగతా 2లో.

## దేశ రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం

: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి** ఉత్తర్ ప్రదేశ్‌లో భారత రక్షణరంగ ఉత్పత్తుల్ని మరింత బలోపేతం చేస్తూ రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. గురువారం ఉత్తర్ ప్రదేశ్ లోని నోయిడాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన సందర్భంగా మాట్లాడిన మోదీ.. భారత సైన్యం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్) లక్ష్యంతో విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

మిగతా 2లో.



## తెలంగాణ ప్రభుత్వం చేతికి

# హైదరాబాద్ మెట్రో

(మొదటి పేజీ తరువాయి)

దీని ప్రకారం మెట్రో మొదటి దశ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఎల్ అండ్ టీకి ఉన్న రూ. 13 వేల కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేస్తుంది. అంతేకాకుండా, ఎల్ అండ్ టీకి రూ. 2,100 కోట్లు నగదు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

దీని ద్వారా హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణ నుంచి ఎల్ అండ్ టీ వైదొలగనుంది. హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ. 22 వేల కోట్లతో నిర్మించారు. 69 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లతో రూపొందించిన ఈ మొదటి దశ నిత్యం 4 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తోంది. అయితే ప్రయాణికుల సంఖ్య తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి కారణాల వల్ల ఈ ప్రాజెక్టు భారంగా మారిందని ఎల్ అండ్ టీ ఇటీవల తెలిపింది. ఈ నేపథ్యంలో, మెట్రో మొదటి దశను తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధమైంది.

# చిరంజీవి గట్టిగా అడిగితే జగన్ దిగొచ్చాడా?...

## అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణ

అమరావతి **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి**

హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ ఏపీ అసెంబ్లీలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సినీ పరిశ్రమకు అవమానం జరిగిందని అన్నారు. అసెంబ్లీలో ప్రసంగిస్తూ, జగన్ ప్రభుత్వ హయాంలో సినీ పరిశ్రమ ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి బాలకృష్ణ మాట్లాడారు. ఆనాడు సినీ ప్రముఖులకు తీవ్ర అవమానం జరిగిందని, కానీ ఎవరూ గట్టిగా నిలదీయలేకపోయారని అన్నారు. అప్పట్లో సినీ సమస్యలపై చర్చించేందుకు జగన్‌తో జరిగిన సమావేశానికి తనకు కూడా ఆహ్వానం అందిందని, అయితే తాను ఆ సమావేశానికి హాజరు కాలేదని బాలకృష్ణ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, బీజేపీ సభ్యుడు కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను బాలకృష్ణ తోసిపుచ్చారు. చిరంజీవి గట్టిగా అడిగితేనే జగన్ సమావేశానికి అంగీకరించారని కామినేని అనగా, అది సరికాదని బాలకృష్ణ అన్నారు. వాస్తవానికి ఎవరూ జగన్‌ను గట్టిగా అడగలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. గట్టిగా అడిగితే జగన్ దిగొచ్చాడని అనడం అబద్ధం అని స్పష్టం చేశారు. ఆయనను (చిరంజీవిని) అవమానించారన్నది ఓకే... కానీ ఆయన చెబితే జగన్ దిగొచ్చాడంట అనేది నిజం కాదు అని వివరించారు.

ఇటీవల విడుదల చేసిన ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్డీసీ) జాబితాలో తన పేరు తొమ్మిదో స్థానంలో ఉండటంపై బాలకృష్ణ అసహనం వ్యక్తం చేశారు. "ఆ జాబితాను ఎవరు తయారు చేశారు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ విషయంపై తాను సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌తో మాట్లాడినట్లు కూడా సభకు వెల్లడించారు.

## దేశ రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

'మన సైన్యం స్వయం సమృద్ధిని సాధించాలని, విదేశీ మూలాలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ఆశిస్తోంది. ఈ లక్ష్యానికి, భారతదేశంలో బలమైన రక్షణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం. ప్రతి ఉత్పత్తి 'మేడ్ ఇన్ ఇండియా'గా ఉండాలని నొక్కి చెబుతున్నాం. దీనికి మద్దతుగా, ఉత్తర్ ప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. రష్యా సహాయంతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుంది' అని పీఎం మోదీ చెప్పారు. ఉత్తర్ ప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నామని.. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ ఇప్పటికే జరుగుతోందని మోదీ చెప్పారు. ఇందులో భాగంగానే, 'అల్టిమేట్ సోర్సింగ్ బిగిన్స్ హియర్' అనే థీమ్‌తో సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఇది ఆవిష్కరణ, సమైక్యత, అంతర్జాతీయీకరణపై దృష్టిపెడుతూ.. విదేశీ కొనుగోలుదారులు, దేశీయ కొనుగోలుదారులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన, ఆధునిక పరిశ్రమలు, కొత్త ఆర్థికవ్యవస్థలను సృష్టించబోతున్నాయని మోదీ అన్నారు. ఈ అభివృద్ధి భారత రక్షణ రంగంలో స్వదేశీ తత్వాన్ని బలపరుస్తూ, ఉత్తర్ ప్రదేశ్‌ను డిఫెన్స్ హబ్‌గా మార్చనుందని ప్రధాని చెప్పారు. దేశ ఆర్థిక, రక్షణ లక్ష్యాలకు ఇది మరో మైలురాయిగా మోదీ అభివర్ణించారు.

.................................

## తిరుమలలో మరో ఆధునిక వసతి సముదాయం

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు బుకింగ్ లేకున్నా భక్తులకు వసతి కల్పించేలా రూ.102 కోట్లతో నూతన కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఇందులో ఒకేసారి 4 వేల మందికి ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నారు. 16 డార్మిటరీలు, 2,400 లాకర్లు, 24 గంటలూ వేడి నీటి సదుపాయం ఇందులో ఉన్నాయి. పీఏసీ-5 ప్రాంగణంలో ఒకేసారి 80 మంది తలనీలాల సమర్పణకు వీలుగా కల్యాణకట్ట ఏర్పాటు-చేశారు. ఒకేసారి 1400 మంది భోజనానికి వీలుగా రెండు డైనింగ్ హాళ్లు ఉన్నాయి. వసతి గృహం బుకింగ్ కౌంటర్‌ను ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి సీఎం పరిశీలించారు. నూతన వసతిగృహంలో తొలి బుకింగ్ టోకెన్‌ను భక్తులకు అందించారు. కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. ఒకేసారి 1400 మంది భక్తులు భోజనం చేసేందుకు వీలుగా ఈ కాంప్లెక్సులో రెండు భారీ డైనింగ్ హాళ్లను కూడా అందుబాటు-లో ఉంచారు. ఈ సందర్భంగా వసతి గృహం బుకింగ్ కౌంటర్ లో బుకింగ్ జరుగుతున్న విధానాన్ని అధికారులు వివరించారు. తొలి వసతి బుకింగ్ టోకెన్ ఓ భక్తురాలికి సీఎం చంద్రబాబు అందించారు. తిరుమల పోటులో కొత్తగా తీసుకువచ్చిన ప్రసాదం తయారీ కోసం వినియోగించే సార్టింగ్ యంత్రాలను ప్రారంభించారు. అనంతరం ఈ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన వ్యర్థాల సేకరణ యంత్రాన్ని ఇరువురు నేతలు ఆసక్తిగా పరిశీలించారు.

# ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ రాష్ట్రంలో పేదరికంలేని సమాజం రావాలి.. అది విద్య ద్వారానే సాధ్యమవుతుంది. అందులో టీచర్లదే కీలక పాత్ర. పిల్లల భవిష్యత్తు మారుస్తారనే టీచర్లను ఎక్కువగా గౌరవిస్తాను. నేను రాజకీయాల్లోకి రావడానికి ఎకనమిక్స్ ప్రొఫెసర్ డీఎల్ నారాయణ ప్రోత్సహించారు. యూనివర్సిటీ క్యాంపస్ నుంచే ఎమ్మెల్యేగా పోటీ- చేశా. ఎమ్మెల్యేగా ఎన్నికైనరెండేళ్లకే మంత్రి అయ్యాను. మనల్ని ప్రోత్సహించే వారుంటే ఆకాశమే హద్దుగా ఉంటుంది. పిల్లల్లో నైపుణ్యాలను ఉపాధ్యాయులే గుర్తించాలి. ప్రపంచ మార్పుల మేరకు ఏపీ యువత విద్య అభ్యసించాలి. పిల్లల మనోభావాల మేరకు చెబితే మంచి ఫలితాలు వస్తాయని చంద్రబాబు అన్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు డీఎస్సీలో టీ-చర్లుగా ఎంపి-కై-న 15,941 అభ్యర్థులకు నియమాక పత్రాలను అందజేశారు. కొద్దిసేపు టిచర్లతో ముచ్చటించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం సభను ఉద్దేశించి చంద్రబాబు ప్రసగించారు. ఇకపై ప్రతిఏటా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని నిరుద్యోగులకు శభవార్త చెప్పారు. ఏపీలో చేతకాని పక్షం ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. మంచి చేయదు.. మంచి జరుగుతుంటే ఓర్వలేదని ఆరోపించారు. గతంలో పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితిని గుర్తు చేశారు. కానీ టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు వచ్చాయని చెప్పారు. వైసీపీ హయాంలో ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యావ్యవస్థ నాశనం అయ్యిందని చంద్రబాబు మండిపడ్డారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెట్టానని చంద్రబాబు తెలిపారు. టీ-చర్లుగా నియామక పత్రాలు తీసుకున్న వారిని అభినందించారు. అవినీతి లేకుండా.. పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టి.. టీ-చర్ల పోస్టింగ్ ఇచ్చామన్నారు. బాబు షూరిటీ-.. జాబ్ గ్యారెంటీ- అని చెప్పాను.. దాన్ని నిజం చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. రూ. 10 లక్షల కోట్లు- పెట్టు-బడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. వాటి ద్వారా నిరుద్యోగులకు 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. 15 ఏళ్లల్లో 14 సార్లు డీఎస్సీని పెట్టి, 1,96,619 ఉద్యోగాలిచ్చామన్నారు. ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుంది.. నిరుద్యోగులు ప్రిపేర్ అవుతూ ఉండాలని ఆయన సూచించారు. డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు వేశారని మండిపడ్డారు. అన్ని ఇబ్బందులను అధిగమించి డీఎస్సీ నిర్వహించిన లోకేష్ టీ-ంను చంద్రబాబు



అభినందించారు. మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తెచ్చాం.. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని సూపర్ జీఎస్టీ తెచ్చారు.. ధరలు తగ్గించారని పేర్కొన్నారు. విద్యా రంగంలో సంస్కరణలు తెస్తున్నాం.. సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వివరించారు. పేరెంట్ టీ-చర్ల మీటింగులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మన బడి- మన భవిష్యత్ పేరుతో మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్నట్లు- చెప్పుకొచ్చారు. టీ-చర్ల బదిలీల చట్టంతో పారదర్శకంగా ఒక్క ఫిర్యాదు కూడా లేకుండా బదిలీలు పూర్తి చేశామని ధీమా వ్యక్తం చేశారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా.. ప్రతి ఒక్కరికి రూ.15 వేలు చొప్పున ఇచ్చామన్నారు.నారా లోకేష్ నో బ్యాగ్ డే విధానం తెచ్చారు.. ఇది వినూత్నంగా ఉందని చంద్రబాబు తెలిపారు. ఈసారి స్కూళ్లు తెరిచేలోగానే స్కూల్ కిట్లు-, పుస్తకాలు ఇచ్చామని పేర్కొన్నారు. అభివృద్ధితో ఉద్యోగాలు వస్తాయి.. ఆదాయం పెరుగుతుందన్నారు. తద్వారా సంక్షేమం సజావుగా సాగించవచ్చని వివరించారు. విలువలతో కూడిన విద్యను అందించేలా టీ-చర్లంతా పని చేయాలని ఆయన సూచించారు. పిల్లల్లో నైతిక విలువలను పెంచేలా టీ-చర్లు పాఠాలు చెప్పాలని తెలిపారు. పిల్లల్లో నైపుణ్యాలు పెంచే బాధ్యత టీ-చర్లు తీసుకోవాలని ఆదేశించారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా టీ-చర్లు అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. భవిష్యత్తులో విద్యా రంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయోననేది టీచర్లు ఊహించగలగాలని చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. తాను నిత్య విద్యార్థినని.. కొత్త విషయాలు నేర్చుకుంటానని సీఎం చంద్రబాబు తెలిపారు. అవి ప్రజలకు ఉపయోగపడతాయనుకుంటే వాటిని అమలు చేస్తానని స్పష్టం చేశారు. 2019-24 మధ్య కాలం విద్యా వ్యవస్థకు ఓ శాపమని ఆరోపించారు. 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ విద్యా రంగాన్ని 19వ స్థానానికి దిగజార్చారని మండిపడ్డారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయని అన్నారు. నో అడ్మిషన్లు బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తెచ్చామని ధీమా వ్యక్తం చేశారు. ఇది మరింతగా పెరగాలని కోరుకుంటున్నట్లు- చెప్పారు. విద్యాశాఖ కఠినంగా ఉంటు-ందని చెప్పాను.. అయినా లోకేష్ ఛాలెంజిగ్గా తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రాథమిక విద్య బాగుంటే ఉన్నత చదువులు అద్భుతంగా ఉంటాయని, దీంతో అభివృద్ధిలో రాష్ట్రం దూసుకెళ్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మెగా డీఎస్సీ విజేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నా చొరవతోనే సమస్యలు పరిష్కారం

## అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలపై చిరంజీవి క్లారిటీ

అమరావతి, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి**

ఏపీ అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. నాడు టాలీవుడ్ ప్రముఖులను కలిసేందుకు జగన్ ఆసక్తి చూపలేదని, చిరంజీవి గట్టిగా అడగడంతోనే జగన్ దిగొచ్చాడని, టాలీవుడ్ పెద్దలను కలిశాడని ఇవాళ్టి సభా సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. అయితే, కామినేని వ్యాఖ్యలను బాలయ్య తప్పుబట్టారు. చిరంజీవి గట్టిగా అడిగితే జగన్ సమావేశానికి ఒప్పుకున్నాడన్నది అబద్ధం అని ఖండించారు. ఆ సైకో గాడ్ని కలిసేందుకు ఇండస్ట్రీ వాళ్లు వెళ్లిన సమయంలో చిరంజీవికి అవమానం జరిగిందన్నది నిజమేనని అన్నారు.

ఈ వ్యాఖ్యలపైనే తాజాగా చిరంజీవి స్పందించారు. నాడు తనను జగన్ సాదరంగా ఆహ్వానించారని చిరంజీవి వెల్లడించారు. అపాయింట్ మెంట్ ఇస్తే సినీ పరిశ్రమ ముఖ్యులందరం కలిసి వస్తామని జగన్ కు చెప్పానని వివరించారు. నాటి సీఎం జగన్ ఆహ్వానం మేరకే తాను ఆయన నివాసానికి వెళ్లానని స్పష్టం చేశారు. ఆ భేటీలో... సినీ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను జగన్ కు వివరించానని తెలిపారు. కాగా, అప్పుడు కొవిడ్ పరిస్థితుల నేపథ్యంలో, ఐదుగురే రావాలని జగన్ చెప్పారని చిరంజీవి గుర్తుచేసుకున్నారు. అయితే, తాము 10 మందిమి వస్తామని చెప్పామని, అందుకు ఆయన అంగీకరించారని వెల్లడించారు. అప్పుడు, బాలకృష్ణ ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేదని అన్నారు. తన పేరు ప్రస్తావనకు వచ్చింది కాబట్టే తాను వివరణ ఇస్తున్నానని చిరంజీవి స్పష్టం చేశారు. "ఏపీ అసెంబ్లీ సమావేశంలో కామినేని శ్రీనివాస్ వ్యాఖ్యలకు నందమూరి బాలకృష్ణ స్పందిస్తూ మాట్లాడిన మాటల్లో నా పేరు ప్రస్తావనకు రావడం జరిగింది. అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ మాట్లాడుతూ "చిరంజీవి గారు గట్టిగా అడిగితే అప్పుడు జగన్ దిగొచ్చాడు అన్నది అబద్ధం. గట్టిగా ఎవడూ అడగలేదు అక్కడ" అంటూ " ఆయనంత పెద్ద గట్టిగా చెబితే ఈయన దిగొచ్చాడంట. లేకపోతే సినీమాటోగ్రఫీ మినిస్టరును కలవడన్నాడట" అంటూ ఒకింత వ్యంగ్యంగా చెప్పడాన్ని నేను టీవీ ఛానల్ లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూశాను. ఈ అంశంలో నా పేరు ప్రస్తావనకు వచ్చింది కనుక నేను ప్రజలకు వివరణ ఇవ్వదలిచాను. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు... తెలుగు సినీ పరిశ్రమకు చెందిన కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు నా వద్దకు వచ్చి సినీ నిర్మాణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా సినిమా టికెట్ల ధరల పెంపుదల గురించి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడితే బాగుంటుందని, అందుకు నన్ను చొరవ తీసుకోవాలని కోరారు. అప్పుడు నన్ను కలిసిన వారిలో రాజమౌళి, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, మహేశ్, ఎన్టీ రామారావు, డీవీవీ దానయ్య, మైత్రి మూవీస్ వారు, ఇంకా ఇద్దరు, ముగ్గురు ప్రముఖులు ఉన్నారు. వారి సూచనల మేరకు నేను అప్పటి రాష్ట్ర సినీమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో ఫోన్ లో మాట్లాడాను. టికెట్ల ధరల విషయం మంత్రి గారితో మాట్లాడి చెబుతానని ఆయన నాతో చెప్పారు. ఆ తర్వాత ఓ రోజు ఆయన నాకు ఫోన్ చేసి... ముఖ్యమంత్రి గారు ముందు మీతో ఒన్ టు ఒన్ కలుస్తానని చెప్పారు. లంచ్ కి రావాలని చెప్పారంటూ డేట్ ఇచ్చారు. ముఖ్యమంత్రిగారి ఆహ్వానం మేరకు నేను ఆయన నివాసానికి వెళ్లాను. నన్ను వారు సాదరంగా ఆహ్వానించారు. లంచ్ చేస్తున్న సమయంలోనే నేను సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వారికి వివరించాను. ఇండస్ట్రీకి మీకు మధ్య గ్యాప్ ఉందని అందరూ అనుకుంటున్నారని, సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని ఆయనకు తెలిపాను. కొన్ని రోజుల తర్వాత మంత్రి పేర్నినాని నాకు ఫోన్ చేసి కొవిడ్ రెండో దశ కొనసాగుతున్నందున, ఐదుగురు మాత్రమే వస్తే బాగుంటుంది అని చెప్పారు. నేనప్పుడు ఓ పదిమందిమి వస్తామని చెబితే సరేనని అన్నారు. డేట్ ఫిక్స్ చేశారు. అప్పుడు నేను బాలకృష్ణ గారిని ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించాను. ఆయన అందుబాటులోకి రాలేదు. జెమిని కిరణ్ ను వెళ్లి బాలకృష్ణను కలవమని చెప్పాను. ఆయన మూడుసార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. దాంతో నేను ఒక ఫ్లైట్ ఏర్పాటు చేసి ఆర్.నారాయణ మూర్తితో సహా మరి కొంతమందిని తీసుకువెళ్లి ముఖ్యమంత్రి గారిని కలిశాను. ఆ సమయంలో నేను ముఖ్యమంత్రి గారితో సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని వివరించాను. సినీ పరిశ్రమకు ప్రభుత్వ సహకారం అందించాలని కోరాను. అందుకు అక్కడున్న వారందరూ సాక్ష్యమే. నేను ఆ రకమైన చొరవ తీసుకోవడం వల్లనే అప్పుడు ప్రభుత్వం సినిమా టికెట్ల ధరల పెంపుదలకు అంగీకరించింది. ఆ నిర్ణయం సినీ పరిశ్రమకు ఎంతో కొంత మేలు చేసింది. ఆ నిర్ణయం వల్ల మీ వీరసింహా రెడ్డి సినిమాకైనా, నా వాల్తేరు వీరయ్య సినిమాకైనా టికెట్ రేట్స్ పెంచడానికి కారణమైంది. తద్వారా ఇటు నిర్మాతలకు, అటు డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు లాభం చేకూరింది. నేను రాష్ట్ర ముఖ్యమంత్రితోనైనా, సామాన్యుడితోనైనా నా సహజ సిద్ధమైన ధోరణిలోనే గౌరవం ఇచ్చిపుచ్చుకునే విధానంలోనే మాట్లాడుతాను. నేను ప్రస్తుతం ఇండియాలో లేను కనుక పత్రికా ప్రకటన ద్వారా జరిగిన వాస్తవాన్ని అందరికీ తెలియచేస్తున్నాను" అని చిరంజీవి ఓ పత్రికా ప్రకటనలో వివరించారు.

# తప్పు చేయను.. చేసేవారిని వదలను

అమరావతి, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి** తను ఎలాంటి తప్పు చేయనని, తప్పు చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని సిఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. రాజకీయ ముసుగులో తప్పులు చేస్తూ నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. ఆడపిల్లల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. డ్రోన్లు, సిసి కెమెరాలతో రాష్ట్రం మొత్తం డేగకన్నుతో పరిశీలిస్తున్నామని, ఎవరు కూడా తప్పులు చేసి ఇక తప్పించుకోలేరని అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాంతి భద్రతల అంశంపై స్వల్ప కాలిక చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. శాంతిభద్రతలు- సామాజిక మాధ్యమాల అంశంపై సీఎం ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం గురించి పోరాడిన వారందరిపైనా కేసులు పెట్టారని తెలిపారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడుపైనా అత్యాచారయత్నం కేసులు పెట్టారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి, స్పీకర్, డిప్యూటీ- స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత పాలకులు పెట్టిన అక్రమకేసుల బాధితులే అని చంద్రబాబు చెప్పుకొచ్చారు. తనపై 17 కేసులు పెట్టి వేధించారని.. ఇది అరాచకానికి పరాకాష్ట అంటూ మండపడ్డారు. యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి లోకేష్ ప్రజలను కలిస్తే కేసులు పెట్టారని.. 'అంగళ్లులో గత పాలకులు నాపై దాడి చేసి తిరిగి నాపైనే కేసులు పెట్టారని గుర్తుచేశారు. ప్రజలతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటే కరెంటు- తొలగించి వేధించారని మండిపడ్డారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర, జేసీ ప్రభాకర్ రెడ్డి, పులివర్తి నాని, నిమ్మల రామానాయుడు, దేవినేని ఉమ, బీటెక్ రవి, కూన రవి ఇలా నేతలందరిపై కేసులు పెట్టారని తెలిపారు . గత ప్రభుత్వ హయాంలో అందరిపైనా కేసులు, వేధింపులే అని అన్నారు. రఘురామకృష్ణంరాజును అరెస్టు చేసినప్పుడు తమకు నిద్ర లేకుండా పోయిందని అప్పటి దారుణాలను సీఎం వివరించారు. అమరావతి రైతులు రాజధాని కోసం పోరాడుతుంటే.. స్నానాలు చేసే బాత్ రూమ్‌లపై డ్రోన్లు ఎగరేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పాదయాత్రలోనూ అడుగడుగునా అడ్డంకులు కల్పించారన్నారు. వీళ్ల అరాచకాలు భరించలేక పారిశ్రామిక వేత్తలు కూడా రాష్ట్రం నుంచి పారిపోయారని తెలిపారు. అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిపోయారని.. రాజకీయాల నుంచి కూడా తప్పుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సింగపూర్ ప్రభుత్వం ప్రపంచంలోనే అత్యంత గౌరవప్రదమైనదన్నారు. చివరకు ట్రంప్, కిమ్‌కు చర్చలు సింగపూర్‌లో పెట్టారని తెలిపారు. సింగపూర్‌లో నైట్ క్లీనింగ్ చూసి హైదరాబాద్‌లో ప్రవేశపెట్టినట్లు- గుర్తుచేశారు. 2014 ఎన్నికల్లో రాజధానిని కడతామని చెప్పామని.. సింగపూర్‌కు సమానంగా కడతామని తెలిపారు. అక్కడి ప్రభుత్వం మాస్టర్ ఎ÷-లాన్‌ను ఫ్రీగా చేసి ఇచ్చిందని.. అలాంటి వాళ్లను వీళ్లు భయపెట్టా రంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత పాలకుల హయాంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని..కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నామన్నారు. నేరస్థులకు అండగా ఉండే రాజకీయ నేతలను తాను ఇంతవరకూ చూడలేదని.. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను బయటపెట్టాలని... వారి ముసుగు తీస్తే ప్రజలే అర్థం చేసుకుంటారని తెలిపారు.

వాహనాలకు సంబంధించి నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగానే ఉంటామని తేల్చిచెప్పారు. ప్రస్తుతం టెక్నాలజీ ఫ్రాడ్స్, సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయని.. నిద్ర లేచినప్పటి నుంచి నిద్ర పోయే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


## మానవ మనుగడకు మొక్కలు నాటండి : పీడీ లీలావతి.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 25:** మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గల రెండవ అంగన్వాడి సెంటర్ ఆవరణంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి లీలావతి మొక్కలు నాటి మానవ మనుగడకు దోహదం చేస్తున్న వృక్షాల గురించి వివరించారు. ఏక్ దిన్ ఏ గంటే ఏక్ షాల్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజలందరూ మొక్కల పెంపకంలో పరిసరాల పరిశుభ్రతకు భాగస్వాములు కావాలని పిడి లీలావతి పిలుపునిచ్చారు. సిడిపిఓ తేజావతీదేవి ఆధ్వర్యంలో పోషణ మాసోస్తవాలను సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

## 1404 మెట్రిక్ టన్నుల యూరియ పంపిణీ.

### సిరివెళ్ల మండల వ్యవసాయ అధికారి సుధాకర్.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 25:** మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల రైతన్నలకు 1404-23 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ జరిగినట్లు, మండల వ్యవసాయ అధికారి ఏ వో.సుధాకర్ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా సొసైటీలు ఆర్ఎస్కేలు ఐక్య సంఘం ద్వారా పంపిణీ జరిగిందన్నారు.వీటితోపాటు మన గ్రోమోర్ మరియు ఇతర ప్రైవేట్ డీలర్లకు వారి వారి కంపెనీలు యూరియా అందజేశాయని తెలిపారు. నంద్యాల జిల్లాలో బనగానపల్లె బండి ఆత్మకూరు నంద్యాల తరువాత శిరివెళ్ళ కే అత్యధికంగా మార్క్ ఫెడ్ ద్వారా యూరియా వచ్చిందని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. వచ్చిన యూరియాను నిబంధనల మేరకు పంపిణీ చేశామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మోడీ పుట్టిన రోజు వేడుకలతో

# బిజెపి శక్తి విశ్వవ్యాప్తం.!

### నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచిమధు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 25:**
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు పక్షోత్సవాల భాగంగా డోన్ లో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ..ప్రధాని మోడీ తన సేవా మనోభావం, దేశాభిమానం ద్వారా ప్రతీ భారతీయుడికి స్ఫూర్తి" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో అభిరుచి మధు ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వి. రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు కిరణ్ తో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి ఊరేగింపును చేపట్టారు. స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర కార్యదర్శి గీతా మాధురి మరియు స్థానిక మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.అనంతరం
అసెంబ్లీ కార్యాలయం ప్రారంభించారు.
బిజెపి అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో భారీ పార్టీ చేరికలు జరిగాయి. కార్యక్రమంలో నిమ్మకాయల సుధాకర్, ఉపేంద్ర నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డోన్ లో బిజెపి శక్తి ప్రదర్శనకు ప్రజల ఘన స్పందన లభించగా, కొత్త చేరికలతో పార్టీ మరింత బలోపేతం అయిందని నాయకులు పేర్కొన్నారు.







# దసరా సెలవులు పాటించని ప్రైవేట్ పాఠశాలల ఎదుట ధర్నాలు చేపడుతాం.

### పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 25:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసి సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 2 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించింది. అయినప్పటికీ నంద్యాల జిల్లాలో అనేక ప్రైవేట్ పాఠశాలలు అక్రమంగా, దౌర్జన్యంగా ప్రభుత్వం చెప్పిన నిబంధనలను ఉల్లంఘిస్తూ బలవంతపు పాఠశాల ల తరగతులు నిర్వహిస్తున్నారని పి.డి.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం పై వారు ఆవేదనవ్యక్తంచేశారు.

స్థానిక కార్యాలయంలో నందు నిర్వహించిన పి డి ఎస్ యూ నంద్యాల డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశం వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులపై లాభాల దాహంతో ఈ ప్రైవేట్ యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కుతూ.! విద్యార్థుల సెలవు హక్కులను ధిక్కరించడం తో పాటు విద్యార్థుల పట్ల మరియు జిల్లా విద్యాశాఖ అధికారుల పట్ల జిల్లా కేంద్రంలో ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యల నిరాంకుశ వైఖరి ఎలా ఉందొ అర్థం అవుతుంది అని వారు అన్నారు. చదువుల పేరుతో విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు మలచే



విధానానికి పిడిఎస్యు నేను ఫోన్ చేయడం కాదు విద్యార్థి సంఘం ఏ విధంగానూ సాహించదాన్నారు.జిల్లా కేంద్రంలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ అక్రమాలను తెలిసీనా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనంగా కూర్చున్నారో? విద్యార్థుల హక్కులుఉల్లంఘింపబడుతున్నప్పుడు అధికారుల నోళ్ళలో తాళాలు వేసుకున్నట్లుగా ఉన్న పరిస్థితి సహించదగినది కాదన్నారు. అధికారులు ఎవరి ఒత్తిడికి లొంగి ఇంత పెద్ద అన్యాయానికి కళ్ళుసమ్మేస్తున్నారు?అని ప్రశ్నించారు. కావున తక్షణమే ప్రైవేట్ పాఠశాల యాజమాన్యలు ప్రభుత్వం జరిచేసిన ఉత్తర్వులు ప్రకారం పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని లేని పక్షం లో అ పాఠశాలల ఎదుట మేము పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఈ పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా మేము మరింత ముమ్మరం చేస్తాం అని వారు ఎచ్చరించారు.ఈ కార్యక్రమం లో పి డి ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు షైక్. షాహిద్, నాయకులు నవీన్,వినోద్,అశోక్, పేర్ల వెంకటేష్, స్టాలిన్, నరేందర్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిరివెళ్లలో డెంగ్యూ నివారణ చర్యలు.

### - సి హెచ్ ఓ రామ్మోహన్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 25:**













గురువారం నాడు స్థానిక మండల పరిధిలోని కామినేనిపల్లె గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావటం వల్ల, వైద్యఅధికారుల ఆదేశాల మేరకు డెంగ్యూ సోకిన వ్యక్తి చుట్టుపక్కల 100 ఇండ్లలో పైరెత్రం స్ప్రేచేయించడం జరిగినది. మరియు మురికి కాలువలో అబేట్ మందును స్ప్రే చేయించి నీటి నిలువులపై వేస్ట్ ఇంజన్ ఆయిల్ పిచికారి చేయించారు.నీటి నిలువలున్న కంటైనర్లను తొలగించారు.మరియు పంచాయతీ సెక్రెటరీ రాయుడు మాట్లాడుతూ ఈరోజు సాయంత్రం 6 గంటల తర్వాత ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి మరియు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి దోమల నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకట రాయుడు మరియు ఏఎన్ఎం చెన్నమ్మ, మౌలాలి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మామిడి నాగరాజు మృతికి సంతాపం తెలియజేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



మామిడి నాగరాజు కుమార్

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 25:** నంద్యాల పట్టణం లోని 37 వ వార్డు టిడిపి ఇన్చార్జ్ మామిడి నాగరాజు కుమార్ మరణ వార్త టిడిపి పార్టీకి తీరని లోటని టిడిపి పార్టీ బలోపేతానికి , నంద్యాలలో టీడీపీ గెలుపు కోసం ఎంతో కృషి చేశాడని ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా దేవుని ప్రార్థిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఒక గొప్ప నాయకున్ని కోల్పోవడం చాలా బాధాకరమని , పార్టీకి అంకితభావంతో పార్టీ కష్టకాలంలో కూడా జెండా భుజాన వేసుకొని మోసినటువంటి నాయకుడు నా మంచి మిత్రుడు మాజీ కౌన్సిలర్ మామిడి నాగరాజు ఆయన లేని లోటు పార్టీకి తీరనిలోటని ఈయన ఆత్మకు శాంతి చేకూర్చవలెనని ఆ భగవంతుని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఒక మంచి మిత్రుని కోల్పోవడం పార్టీకి తీరని లోటని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

## ప్రైవేట్ హాస్పటల్ లకు తక్షణమే పెండింగ్ లో ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి.

### - ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 25:**
గురువారం నాడు స్థానిక నంద్యాల సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేటు హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ నిబంధనలకు వర్తింపు అయ్యేటువంటి ప్రతి చికిత్సకు ఆరోగ్యశ్రీ నుండి అప్రూవల్ వచ్చిన తర్వాత ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలు చికిత్స చేయడం జరిగిందని ఇలా చికిత్స చేసినటువంటి ఆరోగ్య శ్రీ నిధులు ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలకు విడుదల చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని వారన్నారు. పేద ప్రజలు ఏదైనా పెద్ద పెద్ద రోగాలు వస్తే చికిత్స చేయించుకోవడానికి డబ్బు లేక ఇబ్బందులు పడి చనిపోతున్నార



నేటువంటి అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ఆనాడు రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి పేద ప్రజల గుండెల్లో దేవుడై నిలిచినటువంటి ఆరోగ్య శ్రీ ప్రధాత డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టినటువంటి ఆరోగ్యశ్రీని ప్రస్తుతం ఉన్నటువంటి ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసం అని వారు అన్నారు. ప్రభుత్వాలకు పథకాల పైన పెట్టడానికి డబ్బు ఉంటుంది కానీ రాష్ట్ర ప్రజల ఆరోగ్య దృష్ట్యా ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలు డబ్బులు ఇవ్వకపోయినా ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే డబ్బుల కోసం ఎదురుచూపులు చూస్తూ వైద్యం అందించి ప్రజలను కాపాడినటువంటి ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలను ఈ విధంగా ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని వారు హెచ్చరించారు. లక్షల రూపాయలు ఆరోగ్యశ్రీ నిధులు రాక ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్లు యాజమాన్యాలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిలిపివేసినటువంటి ప్రైవేట్ హాస్పిటల్ యొక్క ఆరోగ్య శ్రీ నిధులను తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో కలిసి వచ్చినటువంటి ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్స్ యాజమాన్యాలతో పెద్ద ఎత్తున ప్రత్యక్ష ఆందోళన సిద్ధమవుతామని వారి హెచ్చరించారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత.

## చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్లలో వేయండి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25:**
ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల పట్టణం దేవనగర్ లోని సాంఘిక సంక్షేమ శాఖ (ఎస్సీ) బాలుర వసతి గృహం-1లో "ఏక్ దిన్...ఏక్ గంట...ఏక్ సాత్" స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రమదానంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం %-% 2025లో భాగంగా జిల్లా వ్యాప్తంగా శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వసతి గృహ ప్రాంగణాన్ని శుభ్రపరచి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించామని తెలిపారు. జిల్లాలో సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, మైనారిటీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్ కలిపి మొత్తం 108 ఉన్నాయని, వీటన్నిటిలో కూడా ఇలాంటి శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా శానిటేషన్ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం ఒక గంట సమయం కేటాయించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని చెప్పారు. అలాగే కొంతమంది తమ ఇళ్లను శుభ్రంగా ఉంచుకుని చెత్తను రోడ్లపై వేస్తున్నారని, అది మంచిపద్ధతి కాదని, అందరూ చెత్తను ఖచ్చితంగా డస్ట్‌బిన్లలో వేసే అలవాటు చేసుకోవాలని సూచించారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వాడుక ఎరువులుగా మార్చి రైతులకు అందజేస్తామని, కాబట్టి ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అనంతరం వసతి గృహంలోని గదులను శుభ్రం చేయడం, వంట పాత్రలు, రేషన్ సరుకులు, టాయిలెట్లను పరిశీలించి ముమ్మర పారిశుద్ధ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు సిబ్బందితో పరిశుభ్రం చేయించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, వసతి గృహ వార్డెన్లు, మున్సిపల్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణ ప్రతి ఒక్కరిబాధ్యత.

### కలెక్టరేట్లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమాధాన కార్యక్రమం.

### పరిశుభ్రత తోనే ఆరోగ్యం ఆనందం. - జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25:** పారిశుద్ధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యతని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టలోనే వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు.గురువారం నంద్యాల కలెక్టరేట్ ఆవరణంలో స్వచ్ఛతహి సేవ-2025 లో భాగంగా "ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ.... పరిసరాల పరిశుభ్రతతో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని మన చుట్టూ పక్కల ఉన్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కలెక్టరేట్లో ని ప్రతి కార్యాలయంలో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించుకుని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాలలో కొంతమంది తమ ఇళ్ల పరిసర ప్రాంతాలలో చెత్త దిబ్బలు ఏర్పాటు చేసుకుంటారని అలా చేయడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగు, మలేరియా వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు కూడా పరిసరాల పరిశుభ్రత పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.పట్టణంలోని పాఠశాలలు, మసీదులు, చర్చిల వద్ద మెరుగైన పారిశుద్ధ్యం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను వేగవంతం చేయండి.

### ప్రగతి సూచికలను 5వ తేదిలోపు నమోదు చేయండి.

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబరు, 25:**



బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి సాంకేతిక సమాచార కార్యకలాపాలపై మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 50,035 మంది బంగారు కుటుంబాలు నమోదు కాగా, అందులో 33,631 కుటుంబాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా మిగిలిన 16,404 కుటుంబాలను తక్షణమే మార్గదర్శకులతో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రగతి సూచికల నివేదికలను ప్రతి నెల 5వ తేదీ లోపు మండల అధికారులు నమోదు చేసి, 8వ తేదీలోపు జిల్లా అధికారులు అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. గత ఏడాది అక్టోబర్ నుండి ఇప్పటి వరకు 42,883 ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారా క్లియర్ చేయబడినట్లు వెల్లడించారు. ఇకపై అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని, ఏ అధికారి వద్దా పెండింగ్ ఉండరాదని తెలిపారు. సెలవు దరఖాస్తులు సైతం ఈ-ఆఫీస్ ద్వారానే సమర్పించాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటివరకు 2850 ఫిర్యాదులు స్వీకరించగా, 430 తిరస్కరించి, 169 దరఖాస్తులను ఆమోదించామని వివరించారు. ఈ వ్యవస్థపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు డిఎల్డిఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే ఆర్టిజిఎస్ లెన్స్ ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన 123 పారామీటర్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. డ్రోన్ల వినియోగంపై సంబంధిత శాఖలు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఏజెంట్ స్పేస్ కు సంబంధించి ఇప్పటివరకు 4 లక్షల డాక్యుమెంట్లు గూగుల్ యాప్ ద్వారా అప్లోడ్ చేసినట్లు పేర్కొంటూ, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, సిపిఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న నంద్యాల జిల్లా ఎస్పీ.

**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం సెప్టెంబర్ 25:**
నంద్యాల జిల్లా నూతన ఎస్పీగా పదవి బాధ్యతలు స్వీకరించిన సునీల్ షెరాన్ నేడు నంద్యాల జిల్లాలో గల మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికి ఆలయం వద్దకు రాగానే ఆలయ వేద పండితులు మరియు అధికారులు జిల్లా ఎస్పీ కి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజినాయక్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.




# కోవిడ్‌లో తల్లిదండ్రులు కోల్పోయిన అనాధ పిల్లలకు మిషన్ వాత్సల్య అండ.

## జిల్లాలో 9 మందికి ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25:**
కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద పిల్లలకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య కార్యక్రమాలను అమలు చేస్తోందని, బాధితుల సాధికారత కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మిషన్ వాత్సల్య స్కీం ప్రధానమంత్రి పౌర సహాయం మరియు అత్యవసర పరిస్థితులలో ఉపశమనం నిధి కింద ఆర్థిక సహాయాన్ని పొందిన బాధిత పిల్లలు మరియు వారి సంరక్షకులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. స్త్రీ %-% శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి లీలావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్వప్న ప్రియదర్శిని కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులు ఇరువురిని కోల్పోయిన 9 మంది పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని, వీరికి ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.10 లక్షలు, కలిపి మొత్తం రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేయబడిందని తెలిపారు. బాధిత పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్ సాధికారత కోసం మిషన్ వాత్సల్య పథకం కింద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తల్లిదండ్రులను కోల్పోవడం అనితరసాధ్య లోటు అయినప్పటికీ, కష్టాలను అధిగమించి విద్యలో రాణిస్తే మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని పిల్లలకు ధైర్యం నూరిపోశారు. ఇకపై పిల్లలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా జిల్లా బాలల సంరక్షణ విభాగం లేదా అధికారులను సంప్రదించాలని సూచించారు. బాధితుల కోసం ప్రభుత్వం అందించే అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సమాజంలో నిలదొక్కుకొని మంచి ప్రయోజకులుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

**తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలను ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి %-% జిల్లా కలెక్టర్**

కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనాధ పిల్లలను ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి కలుగుతోందని కలెక్టర్ తెలిపారు. నందికొట్కూరు మండలం వడ్డేమాను గ్రామానికి చెందిన పి.రాజుకు రూ.1.50 లక్షల విలువైన వీడియో కెమెరా, గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామానికి చెందిన ఎస్. సబి సుల్తానా బి.ఫార్మసీ చదువుతున్నదని వివరించగా, ఆమె విద్య కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. పాణ్యం మండలం బలపనూరు గ్రామానికి చెందిన సుప్రియ, సూర్యలక్ష్మిలకు గృహ నిర్మాణ నిధులు మంజూరు చేస్తామని, ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామానికి చెందిన ఎస్. సౌమ్యకు డిగ్రీ పూర్తి చేసుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే మహేష్, మధుసూదన్, వంశీకృష్ణ, ఓబులేసు మొత్తం 9 మంది పిల్లలను పేరుపేరునా పిలిచి వారి పరిస్థితులను తెలుసుకున్న కలెక్టర్, మీకు ఎటువంటి సహాయం అవసరమైనా ఎప్పుడైనా కలెక్టర్ ను సంప్రదించవచ్చున్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

# జిఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించండి.

## మాసాంతపు కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయండి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25:**
జిల్లాలో జిఎస్టీ 2.0 (సూపర్ జిఎస్టీ %-% సూపర్ సేవింగ్స్) సంస్కరణలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 22వ తేది నుండి అమలు చేస్తున్న జిఎస్టీ 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంత మేర లాభం చేకూరుస్తున్నాయో తెలియజేయడం కోసం సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 19 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రముఖ కూడళ్ల వద్ద, మండల స్థాయిలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిఎస్టీ పురోగతి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో జిల్లా జిఎస్టీ ఛాంపియన్‌గా (నోడల్ అధికారి) జాయింట్ కలెక్టర్, నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులు, డివిజన్ వారీగా ఆర్డీవోలు, మండల వారీగా ఎంపీడీవోలు, మున్సిపల్




కమిషనర్లు, వాణిజ్య పన్నుల సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బందిని నోడల్ అధికారులుగా నియమించినట్లు కలెక్టర్ వివరించారు. మొదటి వారం సెప్టెంబరు 25 నుండి అక్టోబర్ 1 వరకు మెప్మా, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామ స్థాయిలో ఆర్పీలు, ఏపిఎంలు, సిసిలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. రెండవ వారం అక్టోబర్ 2 నుండి 8 వరకు వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ట్రాక్టర్, ర్యాలీల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమలు, చేనేత శాఖలు వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. మూడవ వారం అక్టోబర్ 9 నుండి 15 వరకు మున్సిపల్, పంచాయతీ రాజ్, సాంఘిక సంక్షేమ శాఖల ద్వారా ప్రచారం చేయడంతో పాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఆసుపత్రుల పరిధిలో జిఎస్టీ 2.0 పై అవగాహన మేళాలను డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, జిజిహెచ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో జరగాలని కలెక్టర్ ఆదేశించారు. నాలుగవ వారం అక్టోబర్ 16 నుండి 19 వరకు టూరిజం, రవాణా, విద్యుత్ శాఖలు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్ జిఎస్టీ 2.0 వల్ల కలిగే లాభాలపై మండల స్థాయి అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిఎస్టీ 2.0 (సూపర్ జిఎస్టీ %-% సూపర్ సేవింగ్స్) సంస్కరణలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కమీషనర్ మురళీ మనోహర్, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్లు (నంద్యాల డివిజన్) లక్ష్మీనాయక్, హర్ష చందన, డిప్యూటీ సహాయ కమీషనర్లు భువనేశ్వరి, సునీత రెడ్డి, సుదర్శన్, వాణిజ్య పన్నుల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కర్నూలు జిల్లా పోస్ట్ ఆఫీస్ ఉత్తమ సేవల సన్మాన కార్యక్రమం.

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 25:**
ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్ర ప్రభుత్వ పోస్ట్ ఆఫీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ సేవల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిరివెళ్ళ మండలం బోయలకుంట్ల గ్రామం పోస్ట్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న చౌడూరు సుబ్రహ్మణ్య శర్మ పోస్ట్ సేవల రంగంలో అందించిన విశిష్ట సేవలకు గాను గౌరవ సన్మానం పొందారు. వారి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ పోస్ట్ ఆఫీస్ సంఘం వారు సుబ్ర హ్మణ్య శర్మ కు జ్ఞాపికను అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మన గ్రామం నుండి పోస్ట్ ఆఫీస్ రంగంలో ఉత్తమ సేవలందించిన సుబ్రహ్మణ్య శర్మ కు హృదయపూర్వక శుభా కాంక్షలు తెలియజేసిన శిరివెళ్ళ మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి , మరియు వారి సతీమణి బోయలకుంట్ల గ్రామ సహకార సొసైటీ చైర్‌పర్సన్ కాటంరెడ్డి అరుణ , ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్రహ్మణ్య శర్మ బోయలకుంట్ల గ్రామంలో చాలా కాలంగా సమర్పణ భావంతో పోస్ట్ ఆఫీస్ సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారని తెలిపారు.



### భవనాసి వాసు ఆధ్వర్యంలో..

## ‘ఓజి’ సినిమా సంబరాలు.

**భవనాసి వాసు ఆధ్వర్యంలో భారీ కటౌట్లు ఆకర్షణ.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25:** నంద్యాల జిల్లా కేంద్రం లో బుధవారం సినీ వాతావరణాన్ని తలపించింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తాజా చిత్రం ‘ఓజి’ విడుదల సందర్భంగా అభిమానులు టపాసులు కాల్చుతూ, డప్పు వాయిద్యాల మధ్య అభిమానులు ఈలలు వేస్తూ, కేరింతలతో సంబరాలు జరుపుకున్నారు. నంద్యాల జనసేన నాయకులు, నిత్య అన్నదాన దాత భవనాసి వాసు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ముఖ్య ప్రాంతాల్లో భారీ కటౌట్లు ఏర్పాటు చేయడంతో ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో నాగి వెంకటేశ్వర్లు, షబ్బీర్ గబ్బర్ సింగ్, మరచు గురు బాబు, దండు మురళీకృష్ణ, కే. చంద్రశేఖర్, జి. నాగరాజు, కే. సుదర్శన్ రెడ్డి, రెడ్ రోజ్ కృష్ణ, ఎస్వీ. కృష్ణగౌడ్, వెంకటసుబ్బారెడ్డి, గుజరాతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కటౌట్ల వద్ద అభిమానులు హారతులు పెట్టి, పూల వర్షం కురిపించి, డప్పులు మోగిస్తూ జైకొట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన భవనాసి వాసు మాట్లాడుతూ..“పవన్ కళ్యాణ్ కేవలం ఒక సినీ నటుడు మాత్రమే కాదు, ప్రజల కోసం కష్టపడే నిజమైన నాయకుడు. ఉప ముఖ్యమంత్రిగా ప్రజల కోసం చేస్తున్న సేవలు అద్భుతం. ఆయన ప్రజల మనసుల్లో నిలిచిపోయే జననాయకుడు. ‘ఓజి’ సినిమా విజయం ఖాయం. అభిమానులు అంతా దీనిని పండుగ లాగా జరుపుకోవడం గర్వకారణం” అని పేర్కొన్నారు. అభిమానులు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ నినాదాలను గర్జిస్తూ, ఎక్కడ చూసినా జైకారాలు వినిపించాయి. సినిమా విజయంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, ఆ వేడుకలను ఉత్సాహంగా కొనసాగించారు. నంద్యాల పట్టణ వాతావరణాన్ని ఒక్కరోజు పండుగ మయం చేసిన పవన్ కళ్యాణ్ అభిమాన సంబరాలు సినీ వర్గాల్లో విశేషంగా మారాయి.

# కార్ల కు అడ్డా గా మారిన బ్రహ్మానంద స్వామి దేవాలయం.

**భక్తుల బాధలపై కన్నుమూసిన ఈఓ దేవదాయ శాఖ పూర్తిగా విఫలం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25:**
శ్రీ బ్రహ్మానందీశ్వర స్వామి దేవాలయం కోటవీధి నవరాత్రుల రద్దీ నడుమనే ప్రైవేట్ కార్ల పార్కింగ్ కేంద్రంగా మారి భక్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. రెండు రోజులుగా నవరాత్రులు కొనసాగుతున్నా, వాహనాల గజిబిజిని తొలగించడంలో దేవాలయ ఈఓ పూర్తిగా నిర్లక్ష్యం వహించారని భక్తులు మండిపడుతున్నారు. దేవాలయంలో రోజూ జరుగుతున్న వివాహాలు, శుభకార్యాలకు వచ్చే ప్రజలకు పార్కింగ్ సౌకర్యం లేకుండానే వాహనాలు వారాల తరబడి కోటవీధిని ఆక్రమించుకోవడం దేవదాయ శాఖ నిర్వాహక వైఫల్యానికి నిదర్శనమని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల రాకపోకలకు ప్రధానంగా ఉన్న కోటవీధిని ప్రైవేట్ కార్ల కోసం వదిలేయడం, అధికారులు భక్తుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
నవరాత్రి రద్దీ మరింత పెరగకముందే వాహనాల అడ్డా తొలగించకపోతే పెద్ద ఎత్తున నిరసనలు తప్పవని భక్తులు హెచ్చరిస్తున్నారు.

# కళా రంగానికి తోడ్పాటు అందిస్తాం.!

**-కళా పోటీలకు రూ”10,వేలు ఆర్థిక సహాయం. - నంద్యాల టౌన్ హాల్ నందు అంగరంగ వైభవంగా కళాకారుల పోటీలు.**

**-ముఖ్య అతిథిగా పాల్గొన్న 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 25:**
పేద కళాకారులకు అండగా ఉండడంతో పాటు కళారంగం అభివృద్ధికి తనవంతు ప్రోత్సాహం అందిస్తాం అని టీడీపీ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు తెలిపారు. గురువారం పట్టణం లోని టౌన్ హాల్ లో అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో గల కళాకారులకు ఏకాపాత్రాభినయం పై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని 50మంది కళాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా కళాకారులు అందరూ ఏకాపాత్రాభినయం చేస్తూ పట్టణ ప్రజలను మెప్పించారు. దీనితో ఈ పోటీలకు గాను వై.యస్.ఆర్ నగర్ 38వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు తన వంతుగా 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో కళాకారులు ఆయనను శాలువా కప్పి సన్మానించారు ఈ సందర్భంగా తాటికొండ బుగ్గరాముడు మాట్లాడుతూ న్యాయ,మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి. ఫరూక్,ఆయన కుమారులు ఫిరోజ్, ఫయాజ్ ల ఆధ్వర్యంలో కళాకారులు ఎదుర్కుంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం అని అన్నారు. ప్రస్తుతం సమాజంలో కళలకు ఆదరణ తగ్గడంతో కళాకారులు వివిధ రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపారు. ఇందుకోసం సమాజంలోని ప్రతి ఒక్కరు కళాకారులకు అండగా నిలబడి తమవంతు ప్రోత్సహం అందించాలని కోరారు. తరువాత పోటీల్లో గెలుపొందిన కళాకారులకు మొదటి,రెండవ,మూడవ, నాల్గోవ బహుమతులుగా రూ 5వేలు,రూ3వేలు,రూ 2వేలు,రూ 15 వందలు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర కళామండలి కళాకారుల సంఘం అధ్యక్షులు సూరి బాబు,హార్మోనిస్ట్ కొండపల్లి మధుసుధన్ అయ్య,ధూపం రామాంజనేయులు, శివరామి రెడ్డి తదితర కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు బోర్డులను దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 25:**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చెబుతున్నటువంటి జీఎస్టీ తగ్గింపు బోట్లను చాలా వరకు దుకాణాల్లో ఏర్పాటు చేయలేదు జిఎస్టి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చి ఐదు రోజులైనప్పటికీ తగ్గినటువంటి నిత్యవసర మరియు మందులు,సిమెంటు వంటనూనెలు ఇవి కాక దాదాపుగా 400 వస్తువులపై జిఎస్టి తగ్గిందని కానీ వీటిని ఇంకా పాత రేట్లకే విక్రయిస్తున్నారు కావున ప్రభుత్వం వెంటనే వీటిపై స్పందించి అన్ని దుకాణాల దగ్గర బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాము .జిఎస్టి పెరిగినటువంటి వస్తువులను వెంటనే దుకాణదారులు పెంచి అమ్ముతున్నారు కావున తగ్గిన వాటిని కూడా అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పండుగ చేసుకోమని చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో జిఎస్టి తగ్గినటువంటి వస్తువులలో అమలుకానందున ప్రజలపై భారం పడుతుంది కావున వెంటనే స్పందించి జిఎస్టి తగ్గింపు బోర్డులను ఏర్పాటు చేసి ప్రజలకు పండుగ సమయంలో నిజమైన లబ్ధి చేకూర్చులని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో శ్రీరాములు,భాష పాల్గొన్నారు.

# శ్రీశైలం ,సుండిపెంట పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.





**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం సెప్టెంబర్ 25:**
నంద్యాల జిల్లాలోని మహా పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని వన్ టౌన్ మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ లు (శ్రీశైలం మరియు సుండిపెంట) పోలీస్ స్టేషన్లను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పోలీస్ స్టేషన్ల నందుగల రిసెప్షన్ కౌంటర్ , లాకప్ గదులు పలు రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులు అప్డేట్ లో ఉంచుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితులు నిర్భయంగా వారి సమస్యలను తెలియజేసే వాతావరణం కల్పించడంతోపాటు వారితో మర్యాదగా వ్యవహరించి ఓపికతో వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలి.శ్రీశైలం ఆలయ పరిసర ప్రాంతాలు నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉండేలా మరియు గుడి పరిసరాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలి.శ్రీశైలంనకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దైవదర్శనం నిమిత్తం ప్రతిరోజు వస్తూ వెళ్తూ ఉంటారు కాబట్టి భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా మరియు రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి ఉంచి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వాటికి అడ్డుపెట్టవేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల విషయంలో ప్రత్యేక దృష్టి ఉంచి దర్యాప్తు విషయంలోనూ మరియు నేరస్తులను కనుగొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి.శ్రీశైలం నందు జరుగు ఉత్సవాల , ఊరేగింపులు పండుగల సందర్భాలలో ప్రతిష్ట బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చూసుకోవాలని ఆదేశించారు.
విఐపి , వి వి ఐ పి లు దర్శన నిమిత్తం వచ్చినప్పుడు భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రోటోకాల్ నిబంధనల పాటించాలి. ప్రతిరోజు విజిబుల్ పోల్ సింగ్ నిర్వహిస్తూ గంజాయి ,మద్యం అక్రమ రవాణా జరగకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలి. స్టేషన్ ల పరిధిలలో గల రౌడీ షీటర్లు, నేరచరిత్ర గలవారు, అనుమానితుల మొదలగు వారిపై నిఘా ఉంచి శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా అందరూ పనిచేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీశైల మహా పుణ్యక్షేత్రం నందు కొలువుతీరిన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ పాల్గొన్నారు.

## శ్రీ కల్యాణ రామా స్వామి స్వామి ఆలయంలో ఘనంగా దసరా నవరాత్రులు.

**కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు.**



**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల సెప్టెంబర్ 25:**శిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామంలో శ్రీ కల్యాణ రామా స్వామి ఆలయంలోదసరా నవరాత్రి ఉత్సవాలు నాలుగ రోజు అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగవ రోజున కాత్యాయని దేవి అలంకారంలో దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కేశవ స్వామి మరియు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పారాయణలు సహస్ర కుంకుమార్చనలు అభిషేకాలు దీప దూప నైవేద్యాలు సమర్పించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం పూజకుగాను వేణుగోపాల్ రెడ్డి సౌజన్య గారు కుటుంబ సభ్యులు పూజ దాతలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సకల పూజ కైంకర్యాలలో పాల్గొని గ్రామస్తులంతా అమ్మవారిని దర్శించుకున్నారు.

# సత్యమెప్పుడూ కఠినమే!



తిరుమల, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి** సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే- వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. ఎందుకంటే అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. మనిషి బాగుపడాలంటే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా- చేయగలిగిందేమీ ఉండదు. మనిషికి భాగ్యదాయక క్షణాలు ఎప్పుడో కానీ రావు. అలా వచ్చినవాటిని చక్కగా ఉపయోగించుకొనేవాడికి జీవితం ఆనంద బృందావనం అవుతుంది. ఎవరో రావాలని, ఏదో చేయాలని భ్రమలో మునిగిపోతూ కర్తవ్యాన్ని మరచే మనిషిని దేవుడు కూడా బాగుపరచలేడు.

# స్వదేశీ వస్త్రాలనే వాడండి : ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్ **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి** దేశం అన్ని రంగాల్లో మరింతగా రాణించాలంటే స్వదేశీ వస్త్రాలనే ఉపయోగించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. దిన్ దయాళ్ ఉపాధ్యయ జయంతి సందర్భంగా లక్ష్మణ్ నివాళు లర్పించారు. గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. దిన్ దయాళ్ ఉపాధ్యాయ ఇచ్చిన సందేశాన్ని మోదీ సాకారం చేస్తున్నారని తెలిపారు. ప్రధాని జన్ ధన్ ఖాతాలు తెరిపించి బ్యాంకులకు చేరువ చేశారని.. దిక్కు లేని వారికి మోదీ దిక్కయ్యారని చెప్పుకొచ్చారు. 4 కోట్ల మందికి ఆవాసం నిర్మించారన్నారు. మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు.. అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారని ఎంపీ పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకూడదని స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని పిలుపు ఇచ్చారన్నారు. అక్టోబర్ 2న చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి.. చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో భారతదేశాన్ని అభివృద్ధిలో 4వ స్థానానికి మోదీ తీసుకువచ్చారని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ తగ్గించారని.. గొప్ప సంస్కరణ తీసుకువచ్చారని కొనియాడారు. అమెరికా లాంటి దేశాలు టారిఫ్ పేరిట ఇబ్బందులు పెడుతున్నా.. దేశంలో అనేక స్టార్టప్ సంస్థలు తీసుకువస్తున్నారని అన్నారు. సేవ పక్వడలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2047 వరకు దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వదేశీ వస్త్రాలు ఉపయోగించాలని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో ఈడీ ఎంటర్





హైదరాబాద్, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి** సరోగసి పేరుతో పిల్లల ట్రాఫికింగ్‌కు పాల్పడిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రవేశించింది. హైదరాబాద్ పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు ఫైల్ చేసింది. సంతానం లేని దంపతుల నుంచి సరోగసి పేరుతో డాక్టర్ నమత్ర భారీగా నగదు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఆమెను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు. అబార్షన్ కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు నగదు ఆశ చూపి ప్రసవం తర్వాత వారి పిల్లల్ని డాక్టర్ నమ్రత కోనుగోలు చేసేవారు. అనంతరం సరోగసి ద్వారా పుట్టిన బిడ్డగా పిల్లలు లేని దంపతులను నమ్మించి పెద్ద ఎత్తున నగదు వసూలు చేశారు. నాలుగేండ్లలో దాదాపు రూ.500 కోట్ల వరకు లావాదేవీలు జరిపినట్లు ఆధికారులు గుర్తించారు. సికింద్రాబాద్‌తోపాటు విశాఖపట్నంలో ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసిన డాక్టర్ నమత్ర.. ఏజెంట్ల సాయంతో గర్భస్రావం చేయించుకోవాలని దవాఖానకు వచ్చే పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ దందా కొనసాగించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ నమ్రతను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు.

# అమ్మవారికి వేడుకగా కుంకుమార్చనలు

## శరన్నవరాత్రి వేళ తరలివచ్చిన మహిళలు



విజయవాడ, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి**

హిరణ్యవర్ణాం హరిణీమ్ అంటూ అమ్మవారిని భక్తులు విశేషంగా అర్చిస్తున్నారు. దసరా నవరాత్రుల వేళ బెజవాడ దుర్గమ్మకు పద్మప్రియే, పద్మినీ పద్మ హస్తే, పద్మాలయే అంటూ పూజలు చేస్తున్నారు. దుర్గమ్మ అనుగ్రహం కోసం కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు చేస్తున్నారు. బెజవాడ కనకదుర్గమ్మకు పసుపు- కుంకుమలంటే ఎంతో ప్రీతికరం... అందుకే అమ్మవారి ఆరాధనలు, కుంకుమ పూజలకు ఎంతో విశిష్టత ఉంది... ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో అనునిత్యం కుంకుమ పూజలు జరుగుతునే ఉంటాయి....దసరా ఉత్సవాల్లో మరింత విశేషంగా ఈ పూజలు ఏర్పాటు- చేశారు. ప్రతిరోజు బృందాలుగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఆలయ అర్చకస్వాములు ఉభయదాతలతో కుంకుమార్చనలు చేయించారు. భక్తులు విశేష సంఖ్యలో కుంకుమ పూజలకు తరలి రావడంతో దేవస్థాన అధికారులు పూజలకు ఏర్పాట్లు- చేశారు. అమ్మవారి ప్రీత్యర్థం భక్తులు కుంకుమ పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉభయ దాతలు పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. సౌభాగ్య ప్రధాయిని అయిన అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించడం వల్ల మహిళలు ఆజన్మాంతం సకల సౌఖ్యాలతో దీర్ఘ సుమంగళిగా వర్ధిల్లుతారని వేద పండితులు వివరించారు. పెద్దసంఖ్యలో ఉభయదాతలతో పాటు తమ భక్తప్రపత్తులు చాటుకున్నారు.. కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

# శ్రీశైలం,సాగర్‌లకు పెరుగుతున్న పర్యాటకులు

## పూర్తిస్థాయికి రెండు జలాశయాలు -ఆయకట్టు రైతుల్లో ఆనందం



నాగార్జునసాగర్, **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి**

నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనిమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీ జలకళ సంతరించడంతో పర్యాటకుల రాక పెరిగింది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులలు కాగా 587 అడుగుల వద్ద నిలకడగా ఉండేలా చూస్తున్నారు. దీంతో నిండుకుండ ను తలపిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. శ్రీశైలం జలాశయం కూడా నిండుకుండలా మారింది. ఎగువన వర్షాలతో మరింతగా వరదవచ్చి చేరుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీయులు నందికొండకు తరలిరావడంతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిట లాడాయి. చాలా మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చగా

అందుకు అనుగుణంగా తెలంగాణ టూరిజంశాఖ లాంచీలను నడిపించింది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడం, ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబుర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. ఇరవైకి పైగా మర బోట్లు, పుట్టీలు ఉండగా వాటిల్లో చేపల వేటకు వెళ్తారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి నిత్యం రూ.వేలల్లో ఆదాయం పొందుతారు. వేటాడిన చేపలు కేరళ, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. ప్రభుత్వం వీరికి కూడా లైసెన్స్‌లు జారీచేసి ప్రభుత్వం పరంగా చేయూతనిస్తోంది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు.

# ఉల్లిధరలతో కర్నూలు రైతు దిగాలు

## సాగు పెరిగినా..దక్కని గిట్టుబాటు ధరలు



కర్నూలు **సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి** రాష్ట్రంలో ఉల్లి ఘాటు క్రమంగా పెరగాల్సిన ప్రస్తుత సీజన్‌లో రైతులు దిగాలు పడ్డారు. ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నా, రైతులకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు. 1200కు క్వింటా అని ప్రభుత్వం చెప్పినా ఆ ధరలు కూడా రావడం లేదంటున్నారు. గత కొన్ని రోజులుగా ధరలు పతనం అవుతున్నాయి. ఇటీవల 25 రూపాయలు ఉన్న ధరలు ఏకంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి వర్షాల కారణంగా ఉల్లి సరఫరా ఆగిపోయిందని అంటున్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లకు 4-5 వేల క్వింటాళ్ల మేర సరఫరా తగ్గిపోయింది. అయినా రైతులకు మాత్రం ధరలు దక్కడం లేదు. దీంతో హోల్‌సేల్ ధరే కిలో రూ. 20 నుంచి 25కి చేరింది. కర్నూలు జిల్లాలో మార్కెట్‌లోకి ఉల్లి ఈ యేడు భారీగా చేరింది. వర్షాల పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు అనుకున్నంత జరిగినా ధరలు మాత్రం పెరగడం లేదని అంటున్నారు. పొరుగు రాష్ట్రాల్లో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా దిగుబడి తగ్గడంతో ధర కొండెక్కుతుందని భావించారు. దీంతో ఇక్కడి రైతులకు డిమాండ్ వస్తుందని భావించారు. ఈ యేడు దేశంలో ఉల్లి సాగు విపరీతంగాపెరగడంతో ధరలు దిగివచ్చాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో ఉల్లి ధర రూ. 10 నుంచి రూ. 15 వరకు మాత్రమే అమ్మడువతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 20 రూపాయలు పలుకుతుండగా ఇది మరింత పెరిగే అవకాశం లేదు. రాష్ట్రంలో ప్రధానంగా ఉల్లి సాగు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, కొంతమేర కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సాగవుతుంది. రాష్ట్రం నుంచి వస్తున్న ఉల్లితో పూర్తిస్థాయిలో అవసరాలు తీరే అవకాశం లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వచ్చేది. సాధారణంగా రాష్ట్ర మార్కెట్‌లకు మహారాష్ట్రలోని షోలాపూర్, ఔరంగాబాద్, నాసిక్, కర్ణాటకలోని శివమొగ్గ, రాయచూర్ ప్రాంతాలు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి దిగుమతులు ఉంటాయి. అలాగే ఏపీలోని కర్నూలు నుంచి కూడా ఉల్లి సరఫరా అవుతుంది. అయితే ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసిన కుండపోత వర్షాలతో ఉల్లి సాగుకు భారీ నష్టం వాటిల్లింది. కానీ కర్నూలు రైతులు విపరీతంగా సాగు చేయడంతో దిగుబడులు పెరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి వ్యాపారులు నిల్వలు పెంచడంలేదు. మొత్తంగా దిగుబడులు పెంచిన కర్నూలు రైతులు ధరలు లేక డీలా పడ్డారు.

# అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేల డుమ్మా...

**ఫోన్లు చేసి పిలిపించాలని విప్ లను ఆదేశించిన సీఎం చంద్రబాబు**

**అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేల గైర్హాజరుపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం**

**సమావేశం మొదలైనప్పుడు సభలో కేవలం 30 మంది సభ్యులే హాజరు**

**గైర్హాజరైన ఎమ్మెల్యేలను ఫోన్లు చేసి పిలిపించిన చీఫ్ విప్**

**వచ్చినవారిలోనూ కొందరు మధ్యలోనే వెళ్లిపోవడంతో సీఎం అసహనం**

**సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కావాలని స్పీకర్ కూడా హెచ్చరిక**

**కూటమి ఎమ్మెల్యేలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని చంద్రబాబు ఆదేశం**



**సెప్టెంబర్ 25:ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలకు సభ్యులు సరిగా హాజరు కాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు ఎమ్మెల్యేల గైర్హాజరు, వచ్చినా మధ్యలోనే వెళ్లిపోతున్న తీరుపై ఆయన తీవ్ర అసహనం ప్రదర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభలో సభ్యుల బాధ్యతారాహిత్యాన్ని సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.

వివరాల్లోకి వెళితే, శాసనసభ సమావేశం ప్రారంభమయ్యే సమయానికి సభలో కేవలం 30 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దీనిని గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, వెంటనే చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును పిలిచి సభ్యుల గైర్హాజరుపై ఆరా తీశారు. సభకు రాని ఎమ్మెల్యేలకు తక్షణమే ఫోన్లు చేసి పిలిపించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో విప్‌లు రంగంలోకి దిగి ఫోన్లు చేయడంతో, 17 మంది సభ్యులు హుటాహుటిన సభకు చేరుకున్నారు.అయితే, అలా వచ్చిన వారిలో కూడా కొందరు సభ్యులు కీలక చర్చలు జరుగుతుండగానే సభ నుంచి నిష్క్రమించడం ముఖ్యమంత్రి ఆగ్రహాన్ని మరింత పెంచింది. “ఈ విధంగా ఉంటే సమావేశాలు ఎలా జరుగుతాయి? ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో గెలిపించారు, వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదు” అని చంద్రబాబు సభ్యులను ఉద్దేశించి అన్నారు. ఇదే విషయంపై స్పీకర్ ఎ. అబ్దుల్‌ఖాదర్ కూడా స్పందించి, సభ్యులందరూ సమావేశాలు ముగిసే వరకు సభలో ఉండాలని, హాజరు విషయంలో రాజకీయ పార్టీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యేలు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఘటనపై విపక్షాలు కూడా స్పందిస్తూ, అధికార పక్ష సభ్యుల క్రమశిక్షణా రాహిత్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సీఎం కఠినంగా వ్యవహరిస్తారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025

# అభిషేక్ సిక్సర్ల రికార్డు..



సూపర్ ఫామ్ లో ఉన్న భారత విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ తన ఖాతాలో మరో అరుదైన రికార్డును వేసుకున్నాడు. బుధవారం దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో అద్భుతమైన అర్ధ సెంచరీ (37 బంతుల్లో 75, 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఈ క్రమంలో అసియాకప్ ఒక ఎడిషన్ లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్ గా కొత్త రికార్డును నెలకొల్పాడు. కేవలం 5 మ్యాచ్ ల్లోనే తను ఈ ఘనత సాధించడం విశేషం. గతంలో ఈ రికార్డు శ్రీలంకకు చెందిన ఓపెనర్ సనత్ జయసూర్య పేరిట ఉంది. 2008 ఎడిషన్ లో తను 14 సిక్సర్లు బాదడం విశేషం. అప్పుడు ఈ టోర్నీ వన్డే ఫార్మాట్ లో జరిగింది. టోర్నీ ఇప్పటివరకు 16 సిక్సర్లు బాదిన అభిషేక్.. బంగ్లాపై మ్యాచ్ లో ఐదు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. తన జోరుతో మైదానంలోని ప్రత్యర్థి బౌలర్లు చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయారు. భారీ సిక్సర్లతో తన జోరును కొనసాగిస్తూ, కేవలం 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అభిషేక్.. సెంచరీ సాధిస్తాడని అభిమానులు ఆశించారు. గత మ్యాచ్ లో కూడా 70ం స్కోరు చేసిన అభిషేక్.. ఈసారి కూడా ఫ్యాన్స్ ను నిరాశపరుస్తూ మళ్లీ 70ం స్కోరుపైనే ఔటయ్యాడు. అయితే ఈసారి రనౌట్ రూపంలో తను ఔటవడం అభిమానులను షాక్ కు గురిచేసింది. ఇక సూపర్-4లో శ్రీలంకతో చివరి లీగ్ మ్యాచ్ తోపాటు ఫైనల్ (అర్హత సాధించడం దాదాపు ఖాయమే) మ్యాచ్ ఉండటంతో తన సిక్సర్ల సంఖ్యను మరింత పెంచుకోవాలని శర్మ అభిమానులు కోరుకుంటున్నారు. ఈనెల 26న లంకతో, ఫైనల్ మ్యాచ్ ఈనెల 28న జరుగుతుంది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే ఫైనల్ బెర్తు సాధిస్తుందన్న అంచనాతో బరిలోకి దిగిన భారత్.. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసి, భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. నిజానికి ఇన్నింగ్స్ ఆరంభంలో అభిషేక్ చేసిన విధ్వంసంతో ఇండియా భారీ స్కోరు సాధిస్తుందని భావించినా, మిడిలార్డర్ విఫలం కావడంతో అనుకున్నదానికంటే చాలా తక్కువ స్కోరుకే పరిమితం అవ్వాల్సి వచ్చింది. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా (29 బంతుల్లో 38, 4 ఫోర్లు, ఒక సిక్సర్)తో సమయోచిత బ్యాటింగ్ తో జట్టుకు మంచి స్కోరును అందించే ప్రయత్నం చేశాడు. మరో ఓపెనర్ శుభమాన్ గిల్ (29) కూడా వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ఇక బౌలర్లలో రిషాద్ హుస్సేన్ రెండు వికెట్లతో రాణించాడు. ముస్తాఫిజుర్ రహ్మాన్ టీ20ల్లో 150 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. దీంతో ఈ ఘనత సాధించిన తొలి బంగ్లా దేశీప్లేయర్ గా తను రికార్డులకెక్కాడు.

# పాకిస్థాన్ ఆటగాళ్లపై ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు



భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ లో అతిగా ప్రవర్తించిన ఆ ఇద్దరు పాక్ క్రికెటర్స్ పై భారత్ క్రికెట్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఈవిషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్లింది. ఈ-మెయిల్ రూపంలో ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. పాక్ ప్లేయర్లు హారిస్ రవూఫ్, ఫర్హాన్ నుంచి లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉంది. వారు ఇవ్వని పక్షంలో ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ఎదుట వాదనలు వినిపించాల్సిన అవసరం ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ ఫర్హాన్ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత గన్‌షాట్ చూపిస్తూ హావభావాలు ప్రదర్శించాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి చేష్టలకు పాల్పడటం విమర్శలకు దారితీసింది. తన సెలబ్రేషన్స్‌ను ఫర్హాన్ సమర్థించుకొనేందుకు ప్రయత్నించాడు. అప్పటికప్పుడు అలా సంబరాలు చేసుకున్నా..బయట ఎవరు ఏమనుకున్నా పట్టించుకోను అని వ్యాఖ్యానించాడు. హారిస్ రవూఫ్ ఏకంగా జెట్ ఫ్లైట్‌లు కూలినట్లు 6-0 అని సైగలు చూపించాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్ విమానాలను తమ సైన్యం కూల్చేసిందని పాక్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. దానిని గుర్తు చేసేలా హారిస్ చేష్టలు ఉన్నాయనేది ప్రధాన విమర్శ. ఇక భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తో వాగ్వాదానికీ దిగాడు. ఇప్పటికే రిఫరీ విషయంలో అవమానాలు ఎదుర్కొన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారత్‌పై అక్కసును మాత్రం వదలట్లేదు. టీమ్‌ఇండియా సారథి సూర్యకుమార్ యాదవ్‌పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. గ్రూప్ స్టేజ్‌లో పాక్‌పై భారత్ విజయం సాధించింది. ఆ గెలుపును పహల్గాం ఉగ్రదాడి బాధితులు, భారత సైన్యానికి అంకితం ఇస్తున్నట్లు సూర్య వెల్లడించాడు. ఇప్పుడు అదే పాక్ కడుపు మంటకు కారణమైంది. సూర్య వ్యాఖ్యలు రాజకీయపరంగా ఉన్నాయంటూ ఐసీసీ దృష్టికి పీసీబీ తీసుకెళ్లింది.

# ఫైనల్‌కు 12వ సారి భారత్ !



2018, 2023లో భారత ఛాంపియన్‌గా నిలిచింది. ఈసారి ఇండియా కోసం యువ బ్యాట్స్‌మెన్ అభిషేక్ శర్మ అద్భుతంగా ఆడాడు. 5 ఇన్నింగ్స్‌లలో 248 పరుగులు చేశాడు. టోర్నమెంట్‌లో టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్, రెండు మ్యాచ్‌లలో అర్ధ శతకాలు కొట్టాడు, పాకిస్థాన్‌తో సూపర్-4లో 74

ఆసియా కప్ 2025లో, భారతీయ జట్టు చాలా మంచి ప్రదర్శన ఇచ్చి ఫైనల్ కి వెళ్ళింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో, టీమ్ ఇండియా 5 మ్యాచ్‌లు గెలిచి సూపర్-4 రౌండ్‌లో అధిపత్యం చూపి, సెప్టెంబర్ 28న ఫైనల్ ఆడటానికి సిద్ధంగా ఉంది. ఇది ఇండియా ఆసియా కప్‌లో 12వ ఫైనల్. ఈ టోర్నమెంట్‌లో ఇండియా చాలా బాగా ఆడింది. గ్రూప్ స్టేజ్, సూపర్-4 రౌండ్‌లో టీమ్ ప్రతి మ్యాచ్‌లో తన శక్తి చూపించింది. ఫైనల్‌లో ఇండియాకి పాకిస్థాన్‌తో సమరం ఉండవచ్చు. ఇండియా ఆసియా కప్ చరిత్రలో 11సార్లు ఫైనల్ ఆడింది, అందులో 8సార్లు గెలిచింది. 1984, 1988, 1995, 1999, 2010, 2016,

పరుగులు, బంగ్లాదేశ్‌తో 75 పరుగులు చేశాడు. అభిషేక్ దూకుడు బ్యాటింగ్ టీమ్ ఇండియాని ప్రతి మ్యాచ్ లో బలమైన స్థితిలో నిలబెట్టింది. అభిషేక్ రెండు సార్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కూడా గెలిచాడు. భారత్ గెలుపులో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ సహకారం కూడా ముఖ్యమైంది. అయన ఈ టోర్నీలో 12 వికెట్లు తీశాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో, రెండు బంతులకు రెండు వికెట్లు తీసి, ప్రతిపక్ష జట్టుని డిఫెన్స్‌లో పడేశాడు. అయన బౌలింగ్‌లో ఇండియా టీమ్‌కి చాల సార్లు ముఖ్యమైన విజయాలు అందిచింది. భారత్ ఇప్పుడు సెప్టెంబర్ 26న సూపర్-4లో ఆఖరి మ్యాచ్ శ్రీలంకతో ఆడుతుంది. ఇప్పటికే శ్రీలంక ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. కానీ ఈ మ్యాచ్ ఇండియాకి ఫైనల్ ముందు సన్నాహకంగా ఉపయోగపడనుంది. ఈ పెర్ఫార్మెన్స్‌తో ఇండియా ఫైనల్‌లో టైటిల్‌ని కాపాడుకోడానికి సిద్ధంగా ఉంది. సెప్టెంబరు 28న ఫైనల్‌లో పాకిస్థాన్ లేదా బంగ్లాదేశ్‌తో ఏదో ఒక జట్టుతో ఆడనుంది. బంగ్లాదేశ్ దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పాకిస్థాన్‌తో తలపడనుంది. ప్రస్తుతానికి, ఆసియా కప్ సూపర్ 4 పట్టికలో పాకిస్తాన్ బంగ్లాదేశ్ కంటే ముందంజలో ఉంది, కానీ రెండు జట్లు 4 పాయింట్లతో ఉన్నాయి. నికర రన్ రేట్ మాత్రం వేరుగా ఉంది. బంగ్లాదేశ్‌ను పాకిస్తాన్ ఓడిస్తే, ఆసియా కప్ 2025లో భారతదేశం %జం% పాకిస్తాన్ మ్యాచ్‌ను చూసే అవకాశం ఉంటుంది. ఈ సంవత్సరం దుబాయ్‌లో నాల్గోసారి మ్యాచ్‌ను చూసే అవకాశం ఉంటుంది . గాయం కారణంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరంగా ఉండాల్సి వచ్చినందున, పాకిస్తాన్ కెప్టెన్ లిట్టన్ దాస్ రంగంలోకి దిగుతాడా అనేది కూడా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ టోర్నమెంట్‌లో భారతదేశం యొక్క ఫామ్ ప్రశంసనీయం. ఐదు విజయాలతో, భారతదేశం అజేయంగా నిలిచింది. బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. పాకిస్తాన్ కూడా ఈ సీజన్‌లో భారతదేశం చేతిలో రెండుసార్లు ఓడిపోయింది. అందువల్ల, పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్ ఫైనల్‌కు చేరుకున్నా, భారత జట్టు విజయానికి మంచి అవకాశం ఉందని భావిస్తారు.



# బిగ్ బాష్ లీగ్‌లోకి రవిచంద్రన్ అశ్విన్

భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్ బౌలర్లలో ఒకరైన రవిచంద్రన్ అశ్విన్.. ఆస్ట్రేలియాలోని ప్రముఖ బిగ్ బాష్ లీగ్ టీ20 టోర్నమెంట్‌లో ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సిడ్నీ థండర్ జట్టు తమ 15వ బీబీఎల్ సీజన్ కోసం అశ్విన్‌ను తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీని ద్వారా బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న అత్యంత ప్రసిద్ధ, సీనియర్ భారతీయ ఆటగాడిగా రవిచంద్రన్ అశ్విన్ ఘనత సాధించారు. బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న మొదటి భారతీయ ఆటగాడు అశ్విన్ అని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఆ గౌరవం భారత అండర్-19 జట్టు మాజీ కెప్టెన్ ఉన్ముక్త్ చంద్ కు దక్కుతుంది. ఉన్ముక్త్ చంద్ భారత క్రికెట్ నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత, 2021-22 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడాడు. ప్రస్తుతం ఉన్ముక్త్ చంద్ అమెరికా కోసం క్రికెట్ ఆడుతున్నాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఐపీఎల్‌తో సహా భారత క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి పదవీ విరమణ చేసిన ఆటగాళ్లు మాత్రమే విదేశీ టీ20 లీగ్‌లలో పాల్గొనడానికి అర్హులు. ఈ విధంగా చూస్తే, భారత క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తర్వాత బిగ్ బాష్ లీగ్‌లో చేరిన రెండో భారతీయ ఆటగాడు, అత్యంత ప్రముఖ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్. రవిచంద్రన్ అశ్విన్ గతేడాది డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి, గత నెలలో ఐపీఎల్ టోర్నమెంట్ నుంచి తన రిటైర్మెంట్‌ను ప్రకటించారు. ఈ రిటైర్మెంట్ నిర్ణయమే అతనికి విదేశీ లీగ్‌లలో ఆడేందుకు మార్గం సుగమం చేసింది. 38 ఏళ్ల అశ్విన్ తన 221 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌తో సహా ఐదు జట్ల తరఫున ఆడి 187 వికెట్లు తీశారు. అంతర్జాతీయ స్థాయిలో 287 మ్యాచ్‌లలో 765 వికెట్లు పడగొట్టి, టెస్ట్ క్రికెట్‌లో 537 వికెట్లతో ప్రపంచంలో 7వ ప్రముఖ బౌలర్‌గా నిలిచారు. ఈ కొత్త ఒప్పందం గురించి రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. "సిడ్నీ థండర్ జట్టు నన్ను ఎలా ఉపయోగించుకోబోతున్నారనే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నారు. నన్ను ఆడించే విషయంలో వారికి ధైర్యం కూడా ఉంది. ఆ జట్టు నాయకులతో నేను జరిపిన సంభాషణలు చాలా బాగున్నాయి. డేవిడ్ వార్నర్ ఆడే విధానం నాకు చాలా ఇష్టం, మన కెప్టెన్ కూడా మనలాగే ఆలోచించడం ఎల్లప్పుడూ మంచి విషయం. థండర్ అభిమానుల కోసం నా అత్యుత్తమ ఆటను ప్రదర్శించడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. సిడ్నీ థండర్ జనరల్ మేనేజర్ ట్రెంట్ కోప్లాండ్ మాట్లాడుతూ, "అశ్విన్ సిడ్నీ థండర్ జట్టును ఎంచుకోవడం నాకు చాలా గర్వంగా ఉంది. అతని ఉత్సాహం, విజయం సాధించాలనే కోరిక మమ్మల్ని ఆకర్షించాయి. టోర్నమెంట్ మధ్యలో అతని ప్రపంచ స్థాయి బౌలింగ్ జట్టుకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది. ఒక నాయకుడిగా, మార్గదర్శకుడిగా యువ ఆటగాళ్లకు అతని అనుభవం వెలకట్టలేనిది. పశ్చిమ సిడ్నీలో వేగంగా పెరుగుతున్న భారతీయ సమాజంతో అశ్విన్ అనుబంధం మాకు కొత్త అభిమానులను సృష్టిస్తుంది" అని అన్నారు. అశ్విన్ సిడ్నీ థండర్ జట్టులో డేవిడ్ వార్నర్, లాకీ ఫెర్గూసన్, సామ్ బిల్లింగ్స్, పాకిస్తాన్ ఆటగాడు షదాబ్ ఖాన్ వంటి స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడనున్నారు. సిడ్నీ థండర్ స్క్వాడ్:వెస్ అగర్, టామ్ ఆండ్రూస్, రవిచంద్రన్ అశ్విన్ (భారత్), కామెరూన్ బాన్‌క్రాఫ్ట్, సామ్ బిల్లింగ్స్ (ఇంగ్లాండ్), ఓలి డేవిస్, లాకీ ఫెర్గూసన్ (న్యూజిలాండ్), మాథ్యూ గిల్క్స్, క్రిస్ గ్రీన్, ర్యాన్ హాడ్లీ, షదాబ్ ఖాన్ (పాకిస్తాన్), సామ్ కోన్‌స్టాస్, నాథన్ మెక్‌ఆండ్రూ, బ్లేక్ నికితారాస్, డేనియల్ సామ్స్, తన్వీర్ సంఘా, డేవిడ్ వార్నర్.

# ఆస్ట్రేలియా-ఏ జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

- కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ఎంపిక



ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇండియా-ఏ జట్టును బీసీసీఐ ప్రకటించింది. స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ జట్టుకు నాయకత్వం వహించనున్నారు. అంతకుముందు, ఆస్ట్రేలియా '%ూా%'తో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లో కూడా శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే, రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి కొద్ది సమయం ముందు ఆయన ఆకస్మికంగా కెప్టెన్సీని వదులుకుని జట్టు నుంచి విడుదల కావడం చర్చనీయాంశమైంది. రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీని వదులుకోవడానికి ప్రధాన కారణం వెన్ను నొప్పి. గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న శ్రేయస్ అయ్యర్.. మళ్లీ వెన్నులో కొద్దిగా పట్టేసినట్టు , బిగుసుకుపోయినట్టు అనిపిస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగానే ఆయన రెడ్ బాల్ క్రికెట్ నుంచి ఆరు నెలలు విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ఆయన బీసీసీఐకి కూడా తెలియజేశారు. ఆరోగ్య సమస్య ఉన్నప్పటికీ.. ఇప్పుడు వన్డే సిరీస్‌కు సారథిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం. మొదటి వన్డేకు ఇండియా '%ూా%' జట్టు:శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్. రెండు, మూడు వన్డేలకు ఇండియా '%ూా%' జట్టు:శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్-కెప్టెన్), అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్. ఇరానీ కప్ కోసం 'రెస్ట్ ఆఫ్ ఇండియా' జట్టు:రజత్ పాటిదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్-కెప్టెన్), యశ్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తనుష్ కోటియన్, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, ఆకాష్ దీప్, అన్షుల్ కంబోజ్, సారన్ష్ జైన్.

# ఫైనల్ ముందు టీమిండియాను వెంటాడుతున్న భయం ఏంటి..?

ఆసియా కప్ 2025లో టీమిండియా అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా గ్రూప్ దశలో అప్రతిహతంగా విజయాలను సాధించింది. సూపర్-4 రౌండ్‌లోనూ బలమైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లను వరుసగా ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు బలంగా కనిపిస్తున్నా.. భారత జట్టును ఓ భయం వెంటాడుతోంది. అదే.. దారుణమైన ఫీల్డింగ్ వైఫల్యం. టీమిండియా వరుసగా 2 సూపర్-4 మ్యాచ్‌లలో చేసిన ఈ పెద్ద పొరపాటే ఫైనల్లో టైటిల్‌ను దూరం చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పాకిస్తాన్ జట్టుతో జరిగిన కీలకమైన సూపర్-4 మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు చూపించిన ప్రదర్శన ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. జట్టు ఏకంగా 5 క్యాచ్‌లు వదిలేసింది. అంతే కాకుండా ఓ సులవైన రనౌట్ అవకాశాన్ని కూడా కోల్పోయింది. అంటే 6 వికెట్లు తీసే అవకాశాలను వదులుకోవడం ప్రపంచ స్థాయి జట్టుగా పేరున్న భారత్ కు తగని విషయం. ఈ వైఫల్యం జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. పాకిస్థాన్‌పై చేసింది ఒక్క మ్యాచ్ పొరపాటు అనుకుంటే.. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా ఫీల్డింగ్‌లో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఆ మ్యాచ్‌లోనూ భారత ఆటగాళ్లు 5 క్యాచ్‌లు వదిలేశారు. ఇందులో అత్యంత విచిత్రమైన అంశం ఏమిటంటే, ఈ 5 క్యాచ్‌లలో ఏకంగా నాలుగు క్యాచ్‌లు కేవలం ఒకే బ్యాట్స్‌మెన్ సైఫ్ హసన్ ఇచ్చినవే. "క్యాచెస్ విన్ మ్యాచెస్" (క్యాచ్‌లు మ్యాచ్‌లను గెలిపిస్తాయి) అనే సూత్రం క్రికెట్‌లో అందరికీ తెలిసిందే. సూపర్-4 మ్యాచ్‌లలో తక్కువ బలమైన జట్లపై ఈ పొరపాట్లు చేసినా విజయం సాధించినప్పటికీ, ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లలో ఇలాంటి చిన్న పొరపాటు కూడా జట్టుకు భారీ నష్టాన్ని, టైటిల్‌ను కోల్పోయే ప్రమాదాన్ని కలిగించవచ్చు. ప్రపంచ స్థాయి జట్టుగా ఉన్న టీమిండియా ఫైనల్‌కు ముందు తమ ఫీల్డింగ్ లోపాలను తక్షణమే సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే, అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ చేరినా.. కప్పు గెలిచే అవకాశం చేజారే ప్రమాదం ఉంది.

# పవన్ 'ఓజీ' ఫీవర్...

## ఫ్యాన్స్‌కు పండగేనంటున్న టాలీవుడ్




పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' చిత్రం గురువారం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. నిన్న రాత్రి నుంచే తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ షోలు పడ్డాయి. విడుదలైన తొలి షో నుంచే ఈ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. కేవలం అభిమానులే కాకుండా, టాలీవుడ్ సినీ ప్రముఖులు కూడా ఈ సినిమాపై ప్రశంసల వర్షం కురిపిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీంతో 'ఓజీ' ఫీవర్ ఇండస్ట్రీని ఓ ఊపు ఊపేస్తోంది.
యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై పలువురు దర్శకులు, నిర్మాతలు, హీరోలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. "స్క్రీన్‌పై అసలైన ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్‌ను చూశాం. పవన్ కల్యాణ్ నటన అద్భుతం. ఇది నిజంగా బ్లాక్‌బస్టర్" అని దర్శకుడు బాబీ ట్వీట్ చేశారు.
నిర్మాత నాగవంశీ స్పందిస్తూ, "'ఓజీ' ఒక ఫైర్‌స్టార్మ్. ఇంట్రో, ఇంటర్వెల్ సీన్లు గూస్‌బంప్స్ తెప్పించాయి. పవన్ స్వాగ్, తమన్ బీజీఎం అదిరిపోయాయి. హంగ్రీ చీతా వేట మొదలైంది" అని పేర్కొన్నారు. మరో నిర్మాత ఎస్‌కేఎన్, ఈ చిత్రం ఫ్యాన్స్‌కు పండగలా ఉందని, దసరా సీజన్‌లో దీపావళిని తెచ్చిందని అన్నారు.
హీరో నాని కూడా, "వేరే వాళ్ల మాటలు వినకండి. 'ఓజీ' బ్లాక్‌బస్టర్ అంతే" అంటూ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. సినిమాకు వస్తున్న స్పందనతో మెగా ఫ్యామిలీలోనూ పండగ వాతావరణం నెలకొంది. మెగా హీరోలు సాయి ధరమ్ తేజ్, వరుణ్ తేజ్ థియేటర్‌లో సాధారణ ప్రేక్షకుల మధ్య కూర్చుని సినిమా చూస్తూ కాగితాలు విసురుతూ సందడి చేశారు. పవన్ కల్యాణ్ పిల్లలు అకీరా, ఆద్య కూడా తండ్రి సినిమాను చూసి ఎంజాయ్ చేశారు.
సినిమాలో పవన్ ఎంట్రీ, యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ డైలాగులు ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాయని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తమన్ అందించిన నేపథ్య సంగీతం (బీజీఎం) మాస్ ఆడియన్స్‌కు పూనకాలు తెప్పిస్తోందని అంటున్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా సుజీత్ తన విజన్‌ను మరోసారి నిరూపించుకున్నాడని సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

# జయం రవికి మరో షాక్

## ఇంటిని వేలం వేయనున్న బ్యాంకు



తమిళ నటుడు జయం రవి(రవి మోహన్) మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇప్పటికే తన భర్య ఆర్తితో విడాకుల వివాదం కోర్టులో నడుస్తుండగా.. తాజాగా అతడి ఇల్లు వివాదంలో చిక్కుకుంది. చెన్నైలోని ఇంజంబక్కంలో ఉన్న ఆయన ఇంటిని వేలం వేయడానికి బ్యాంకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ ఇంటికి సంబంధించి జయం రవి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ప్రైవేటు బ్యాంక్ అధికారులు ఆయన ఇంటికి వేలం నోటీసులను అంటించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్త కోలీవుడ్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. జయం రవి తన ఇంటి కోసం ఒక ప్రైవేటు బ్యాంక్ నుంచి పెద్ద మొత్తంలో గృహ రుణం తీసుకున్నట్లు సమాచారం. ఈ రుణానికి సంబంధించిన నెలవారీ ఈఎంఐలను ఆయన చెల్లించకపోవడంతో వడ్డీతో కలిపి సుమారు రూ.7.60 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయినట్లు బ్యాంకు జారీ చేసిన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఈ రుణం చెల్లించమని బ్యాంక్ యాజమాన్యం గతంలో పలుమార్లు జయం రవికి నోటీసులు పంపించింది. కానీ వాటికి జయం రవి స్పందించకపోవడంతో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఆస్తులు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ కింద ఈ ఇంటిని వేలం వేసి తమ బకాయిలను వసూలు చేసుకోవడానికి బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది.

# సాహితీ ఇన్ ఫ్రా కేసులో నటుడు జగపతిబాబును విచారించిన ఈడీ




టాలీవుడ్ ప్రముఖ నటుడు జగపతిబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరుకావడం చిత్ర పరిశ్రమలో కలకలం రేపింది. భారీ మోసానికి పాల్పడిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సాహితీ ఇన్ ఫ్రా కేసులో భాగంగా, అధికారులు ఆయనను సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆయన ఈడీ కార్యాలయానికి రావడం చర్చనీయాంశంగా మారింది.దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ విచారణలో, జగపతిబాబు గతంలో సాహితీ ఇన్ ఫ్రా సంస్థ యాడ్స్ లో నటించ అంశంపై ఈడీ అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఆ సంస్థ ప్రకటనల్లో నటించినందుకు గాను ఆయనకు అందిన పారితోషికం, చెల్లింపుల మార్గాలపై వివరాలు సేకరించినట్టు సమాచారం. ఆ లావాదేవీల గురించి కూపీ లాగినట్లు తెలుస్తోంది.ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కస్టమర్లను ఆకర్షించిన సాహితీ ఇన్ ఫ్రా, సుమారు 700 మంది నుంచి రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసి మోసానికి పాల్పడిందనేది ప్రధాన ఆరోపణ. ఈ నిధులను షెల్ కంపెనీలకు మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారని ఈడీ దర్యాప్తులో తేలింది. ఇదే కేసులో భాగంగా, మోసం ద్వారా సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన రూ.161 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది.
గతంలో ఎలాంటి వివాదాల్లోనూ పేరు వినిపించని జగపతిబాబును ఈడీ విచారించడం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం ప్రకటనల్లో నటించినందుకే ఆయన్ను సాక్షిగా విచారించారా లేక మరేదైనా కోణం ఉందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# హాట్ టాపిక్ సమంత వాచ్‌ధర



తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో తన నటనతో పాటు స్టైలిష్ ఫ్యాషన్ సెన్సేషన్‌గా నిలిచిన అందాల తార సమంత తాజాగా కొత్త లగ్జరీ వాచ్ ధరించి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది.
ఇటీవల సమంత సినిమాల కన్నా కూడా బ్రాండ్లని ప్రమోట్ చేస్తూ ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. తాజాగా ఒక లగ్జరీ వాచ్ ను ధరించిన సామ్ అందుకు సంబంధించిన ఫోటోలను షేర్ చేయగా,ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.అయితే సమంత ధరించిన ఆ వాచ్ అందరి దృష్టిని ఆకర్షించగా, అది ఏ కంపెనీది..? దాని ధర ఎంత ? అంటూ గూగుల్ లో ఆరా తీస్తున్నారు . ఈ క్రమంలో సమంత ధరించిన వాచ్ ట్రాపేజ్డ్ ఆకారంలో ఉండే పియాజెట్ 60 జువెలరీ వాచ్ కాగా , దీని రేటు సుమారు రూ.30 లక్షలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. ఇది తెలుసుకున్న నెటిజన్లు అవాక్కవుతున్నారు. గతంలోనూ సమంత పలు స్టైలిష్ అండ్ లగ్జరీ వాచెస్ ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె ఎక్కువగా బల్గారీ సర్పెంటీ వాచ్ (రూ. 45 లక్షలకు పైగానే) ధరించి కనిపిస్తుంటుంది. మొత్తానికి సమంత ఈ కొత్త వాచ్‌తో హాట్ టాపిక్ అయింది. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న "మా ఇంటి బంగారం" సినిమాలో నటిస్తోంది. అంతేకాదు, రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతోన్న వెబ్ సిరీస్ "రక్త బ్రహ్మాండ్" లోనూ సమంత తన నటనా ప్రతిభను చాటేందుకు కృషి చేస్తుంది. ఇకపోతే సమంత-రాజ్ జంట ప్రేమ వ్యవహారం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముంబై బాంద్రాలోని ఓ జిమ్ నుంచి కలిసి బయటకు రావడం, ఒకే కారులో వెళ్లిపోవడం వంటివి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తుందని, త్వరలోనే వివాహం చేసుకోవడం ఖాయం అని అంటున్నారు. కొన్నాళ్లుగా వీరి రిలేషన్ గురించి అనేక వార్తలు వస్తున్నా కూడా సమంత కాని, రాజ్ కాని స్పందించింది లేదు.



# ఆలియా భట్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. సెలబ్రిటీలు మాట్లాడే ప్రతి మాటనూ చాలా జాగ్రత్తగా గమనించే ఈ రోజుల్లో, ఆమె తన గత చిత్రాల గురించి చేసిన ఒక చిన్న పొరపాటు నెటిజన్లకు టార్గెట్‌గా మారింది. దీంతో కొందరు ఆమెను విమర్శిస్తుంటే, మరికొందరు అభిమానులు మాత్రం ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.
విషయంలోకి వెళ్తే, ఇటీవల ఇటలీలోని మిలాన్‌లో గూచీ స్ప్రింగ్/సమ్మర్ 2026 ఫ్యాషన్ షో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గూచీ గ్లోబల్ అంబాసిడర్‌గా హాజరైన ఆలియా భట్, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన తదుపరి చిత్రం 'ఆల్ఫా' గురించి ప్రస్తావిస్తూ, అది తన కెరీర్‌లోనే మొదటి యాక్షన్ సినిమా అని, ఈ ప్రాజెక్ట్ పట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నానని, కాస్త భయంగా కూడా ఉందని తెలిపారు.
ఆలియా చేసిన ఈ వ్యాఖ్యలే ఇప్పుడు వివాదానికి కారణమయ్యాయి. 'ఆల్ఫా' ఆమె మొదటి యాక్షన్ సినిమా ఎలా అవుతుందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఆమె నటించిన 'రాజీ', 'జిగ్రా' వంటి చిత్రాల్లో కూడా అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, హాలీవుడ్ చిత్రం 'హార్ట్ ఆఫ్ స్టోన్'లో సైతం ఆమె తన యాక్షన్ ప్రతిభను నిరూపించుకున్నారని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇంతటి అనుభవం ఉన్నప్పటికీ, 'ఆల్ఫా'ను తన తొలి యాక్షన్ చిత్రంగా పేర్కొనడం సరికాదని విమర్శిస్తున్నారు.అయితే, ఆలియా అభిమానులు మాత్రం ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. 'రాజీ' చిత్రంలో యాక్షన్ ఉన్నప్పటికీ, అది ప్రధానంగా స్పై థ్రిల్లర్ అని, కథకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని వాదిస్తున్నారు. అలాగే, 'జిగ్రా'లో కూడా యాక్షన్ సన్నివేశాలు పరిమితంగానే ఉన్నాయని చెబుతున్నారు. కానీ, 'ఆల్ఫా' చిత్రం పూర్తిగా యాక్షన్ ప్రధానంగా తెరకెక్కుతున్నందువల్లే, ఆలియా దానిని తన మొదటి పూర్తిస్థాయి యాక్షన్ సినిమాగా భావించి ఉండవచ్చని మద్దతు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఈ అంశంపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.